రైతులూ.. ఫోన్ చేద్దాం.. పరిష్కరించుకుందాం


నేడు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్



ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో పది రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. నష్ట పరిహారం అందజేయడానికి అధికారులు పరిశీలన చేపట్టనున్నారు. మరోవైపు ఈ- క్రాప్ నమోదు, రబీ సాగుకు సెనగ, ఇతర విత్తనాల పంపిణీ సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటికి పరిష్కార మార్గాలు, పంటలను కాపాడుకునేందుకు సూచనలు.. నష్టాలు, పరిహారం అందుకునే క్రమంలో తలెత్తే అనుమానాల నివృత్తికి 'ఈనాడు' వారధి కానుంది. జేడీఏ, ఉద్యాన శాఖ అధికారి, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. సమస్యలు తెలిపితే వాటికి తగు సమాధానాలిస్తారు. పరిష్కారానికి తమవంతు చర్యలు చేపడతారు. ఇందుకుగాను రైతులు ఈ దిగువ తెలిపిన తేదీలో సదరు నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది.

ఫోన్ ఇన్ తేదీ:	సమయం: ఉదయం	ఫోన్ చేయాల్సిన నంబర్:
25-10-24	9 నుంచి 10 గంటల మధ్య	8331 057048

నడిబొడ్డున నరకయాతన




ఒంగోలు నగరం నడిబొడ్డున నిత్యం నరకయాతన తప్పడం లేదు. మంగమ్మ కళాశాల కూడలి నుంచి కర్నూలు రోడ్డు వరకు భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటు కోసం వైకాపా ప్రభుత్వ హయాంలో గోతులు తవ్వారు. అనంతరం పైపైన మట్టి కప్పి చేతులు దులుపుకొన్నారు. ఇటుగా రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మట్టి కుంగి గోతులు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా నీళ్లు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వాహన చోదకులకు నిత్యం గోతులు కనిపించకపోవడంతో చక్రాలు కూరుకుపోతున్నాయి. గురువారం మధ్యాహ్నం ఓ ఐచర్ గుంతలో ఇరుక్కుంది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో క్రేన్ సాయంతో బయటకు తీయాల్సి వచ్చింది. - ఈనాడు, ఒంగోలు

వెలిగొండ.. ఆశల చిగురింత

- ప్రాధాన్య ప్రాజెక్ట్‌గా గుర్తింపు
- సమీక్షించిన సీఎం, మంత్రులు





'పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా. నిర్మాణం పూర్తి చేసి నేనే ప్రారంభిస్తా. కరవు నేలకు కృష్ణాజలాలను అందించి, మీ ఆకాంక్షలను నెరవేరుస్తా. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఇవ్వండి..' - ఇవీ గత సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు.

ఇచ్చిన హామీ అమలుకు అనుగుణంగానే అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండను సందర్శించి అధికారులతో సమీక్షించారు. సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. మంత్రివర్గ సమావేశంలోనూ ఈ ప్రాజెక్టును ప్రాధాన్య జాబితాలో చేర్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో వెలిగొండ పూర్తిపై ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


న్యూస్‌టుడే, పెద్దారవీడు, పెద్దదోర్నాల

గత వైకాపా పాలకుల అయిదేళ్లలో వెలిగొండ ప్రాజెక్టుపై చేసిన పాపాలు, నిర్లక్ష్యం ఆనవాళ్లు నేటి పాలకులకు శాపాలుగా మారాయి. మొత్తం రూ. 4,012 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి కేవలం రూ. 764 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నిర్మాణాన్ని గాలికొదిలేసి ఎన్నికల వేళ ఓట్ల జగన్నాటకానికి తెర లేపారు. పనులన్నీ పూర్తిచేశామంటూ ఉత్తుత్తి సొరంగాలను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్, నిర్వాసితుల సమస్యలు, తీగలేరు ప్రధాన కాలువలు, అసంపూర్తి పనులపై దృష్టి సారించకుండా జిల్లాకు అన్యాయం చేశారు.

పునరావాసంపై నాడు పగ...: వాస్తవానికి పునరావాస కాలనీలపై దృష్టి సారించి, నిర్వాసితులను తరలిస్తేనే జలాశయంలో నీరు నింపే అవకాశం ఉంటుంది. 2014లో తెదేపా ప్రభుత్వం ప్రాజెక్ట్ 11 ముంపు గ్రామాల నిర్వాసితులకు మొత్తం ఏడు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. నాలుగు చోట్ల అన్ని వసతులతో కూడిన కాలనీలను అభివృద్ధి చేసింది. పాఠశాల, ఆరోగ్య కేంద్రం, సీసీ రోడ్లు, కాలువలు వంటి పనులు చేపట్టింది. మిగిలిన మూడు చోట్ల ప్రారంభించే సమయానికి ప్రభుత్వం మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా నిర్వాసితులపై పగబట్టినట్లు వ్యవహరించింది. దేవరాజుగట్టు, వేములకోట, ఒందుట్ల వద్ద పునరావాస కాలనీల నిర్మాణాలను ప్రారంభించి వదిలేసింది. అప్పటికే పూర్తి చేసిన నిర్మాణాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ఈ విషయం ఇప్పుడు ఓ గుదిబండగా మారింది.



మార్కాపురం మండలం వేములకోట వద్ద పునరావాస కాలనీ పరిస్థితి



ఫీడర్ కాలువపై నిలిచిపోయిన వంతెన నిర్మాణం

ఫీడర్ కెనాల్ పైనా నిర్లక్ష్యం...

కృష్ణానది నుంచి సొరంగాల ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు నీరందించాలంటే ప్రధానమైనది ఫీడర్ కాలువ. దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని సొరంగాల నుంచి పెద్దారవీడు మండలం కలనూతల సమీపంలోని నల్లమల సాగర్ వరకు 21.08 కి.మీ పొడవు, 23 మీటర్ల వెడల్పుతో ఈ నిర్మాణం ఉంటుంది. కాలువపై 3.4 కిలోమీటరు వద్ద యూటీ వంతెన రూ.8.68 కోట్లతో నిర్మించాల్సి ఉంది. నాలుగో కిలో మీటరు వద్ద రూ.20 కోట్లతో ఎస్కేప్ కం క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలువపై 20 వంతెనలు నిర్మించాల్సి ఉండగా వైకాపా అధికారంలోకి వచ్చే నాటికే పద్నాలుగింటిని తెదేపా పూర్తి చేసింది. మిగిలిన మూడు నిర్మాణ దశలో నిలిచిపోగా.. వాటిని వైకాపా సర్కారు గాలికొదిలేసింది. నిర్వహణ లేక కాలువ కరకట్టలు బలహీనపడ్డాయి. చిన్నపాటి వర్షాలకే అవి తెగి దోర్నాల మండలంలోని ఎడవల్లి, కడపరాజుపల్లె, కటకానిపల్లె గ్రామాల్లోని పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటన్నింటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

1 దేశం 1 సంఖ్య



- విద్యార్థి భవితవ్యానికి 'అపార్'
- స్కాన్ చేస్తే పూర్తి సమాచారం

పామూరు, న్యూస్‌టుడే:

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్య అందించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఆధార్ తరహాలో 'ఒకటే దేశం.. ఒకరే విద్యార్థి(వన్ నేషన్.. వన్ స్టూడెంట్) అనే నినాదంతో కొత్త ప్రక్రియను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వివరాల ఆన్‌లైన్ నమోదు మొదలైంది. ప్రస్తుతం ఒకటి నుంచి ఇంటర్ తరగతులు చదివే ప్రతి విద్యార్థి వివరాలను అపార్ కార్డుకు విధిగా నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. వచ్చే నెల 30వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

● డిజిటల్ కార్డుల్లో భద్రం...: ఆధార్ తరహాలో గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు తొలుత 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల వివరాలను యూ డైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు విద్యార్థుల పేరు, జన్మించిన తేదీ, లింగం, క్యూ ఆర్ కోడ్, ఫొటో, 12 అంకెల ప్రత్యేక సంఖ్య, మార్కులు, గ్రేడ్, ఉపకార వేతనం, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. దీంతో కార్డులను స్కాన్ చేస్తే మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే సదుపాయం కలుగుతుంది.

● ఉద్యోగాల భర్తీలోనూ కీలకం...: విద్యార్థి బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అపార్ కార్డు అనుసంధానమై ఉంటుంది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ వంటివన్నీ సులభంగా పూర్తిచేసే అవకాశం కలుగుతుంది. ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ కార్డు కీలకం కానుందని అధికారులు చెబుతున్నారు.



జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు:	I- 10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య:
2,981	3,04,233

నకిలీలకు ఇక అడ్డుకట్ట...

ప్రతి విద్యార్థి అపార్ కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి గుర్తింపు సంఖ్య ఇస్తారు. ఒక్కసారి అపార్ సంఖ్య పొందితే అందులో అన్ని వివరాలు ఉంటాయి. ఐడీ స్కాన్ చేస్తే.. విద్యార్థి వివరాలు తెలుస్తాయి. నకిలీ ధ్రువీకరణ పత్రాలకూ అవకాశం ఉండదు. ప్రతి విద్యార్థికి ఇది చాలా అవసరం.

–ఎ.చంద్రమౌళీశ్వర్, ఉప విద్యాశాఖాధికారి, కనిగిరి

ప్రాజెక్టులు.. పదవులు

- చర్చించిన ఉమ్మడి జిల్లా నేతలు
- వెలిగొండ ప్రాజెక్ట్‌కు ప్రజాప్రతినిధులు



విజయవాడలో సమావేశమైన ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, తెదేపా నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, తెదేపా నేతలు విజయవాడలోని మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చ సాగింది. జిల్లాకు తలమానికమైన వెలిగొండతో పాటు, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై చర్చించారు. ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో వాటితో పాటు; పీఏసీఎస్‌ల ఎన్నికలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకం పైనా మాట్లాడుకున్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్(ఒడా ఛైర్మన్) పదవి మిత్రపక్షమైన జనసేనకు కేటాయింపుతో పాటు, పీడీసీసీ బ్యాంక్ పదవికి ఒంగోలు, కనిగిరికి చెందిన ఇద్దరి పేర్లు పరిశీలనకు వచ్చినట్లు సమాచారం.

29న బృందంగా సందర్శన...: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్ట్ పురోగతిపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఈ నెల 29న రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు, ఉమ్మడి ప్రకాశానికి చెందిన మంత్రులు, తెదేపా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులు ప్రాజెక్ట్‌ను సందర్శించాలని నిర్ణయించారు. సమావేశంలో మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్(ఒంగోలు), ఏలూరి సాంబశివరావు(పర్చూరు), ముక్కు ఉగ్రనరసింహారెడ్డి(కనిగిరి), ముత్తుముల అశోక్‌రెడ్డి(గిద్దలూరు), కందుల నారాయణరెడ్డి(మార్కాపురం), ఇంటూరి నాగేశ్వరరావు(కందుకూరు), రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల బాధ్యులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశానికి చెందిన నలుగురు కూటమి నేతలను కార్పొరేషన్ల ఛైర్మన్లుగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల కొరత రానీయొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులకు అవసరమైన ఎరువులను కొరత లేకుండా సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ జిల్లా అధికారులతో ఒంగోలు ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ప్రాంతంలో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేయనున్నారు, అందుకు ఎరువులు ఎంత అవసరం, మార్క్‌ఫెడ్ నుంచి జిల్లాకు ఎంత మేర సరఫరా అవుతున్నదీ ప్రతి రోజూ నివేదిక అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉద్యాన వన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్‌కు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమె కన్నీరు పట్టని పోలీసులు



ఆమె పేరు హర్షవర్దిని. ఊరు నెల్లూరు జిల్లా కందుకూరు మండలం మాచవరం. కొద్దికాలం క్రితం జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన నవీన్ అనే వ్యక్తితో వివాహమైంది. అప్పటి నుంచి గృహిణిగా ఉంటూ భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి సంతోషంగా జీవిస్తోంది. సాఫీగా సాగుతున్న వారి సంసారంలో వివాహేతర సంబంధం ఒక్కసారిగా చిచ్చు రేపింది. అప్పటి వరకు భార్య, పిల్లలే లోకంగా ఉన్న భర్త మరో మహిళ మాయలో పడి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. అదేమని అడిగితే వేధిస్తూ.. చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. విసిగివేసారిన బాధితురాలు న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. విచారించాల్సిన పోలీసులు ఆ విషయాన్ని విస్మరించారు. ఫిర్యాదునూ తీసుకోలేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఇద్దరు పిల్లలతో కలిసి హర్షవర్ధిని గురువారం జిల్లా కేంద్రం ఒంగోలు వచ్చింది. కలెక్టరేట్ ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టింది. తనకు న్యాయం చేయాలని కోరుతున్నా పోలీసు స్టేషన్‌కు వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమైంది. అప్పటికి కానీ పోలీసులు స్పందించలేదు. యువతి ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు కలెక్టరేట్ వద్దకు వచ్చారు. బాధితురాలితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

డీఆర్వోగా చిన ఓబులేసు



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా బి.చిన ఓబులేసు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా తెలుగు గంగ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన ఓబులేసు వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ఆర్డీవోగా, ఆ తర్వాత ప్రకాశం డీఆర్వోగా పనిచేశారు. తాజాగా మరోసారి ఇక్కడే డీఆర్వోగా నియమితులయ్యారు. ఈ నెల 28న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుత డీఆర్వో ఆర్.శ్రీలతకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. తదుపరి పోస్టింగ్ నిమిత్తం రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఈవోగా కిరణ్ కుమార్



ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో)గా గుంటూరు డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు అత్తోట కిరణ్ కుమార్ నియమితులయ్యారు. కిరణ్ కుమార్ గతంలో మైనంపాడు డైట్ ప్రిన్సిపల్‌గానూ విధులు నిర్వహించారు. ఆ తర్వాత బాపట్ల ఉప విద్యాశాఖ అధికారిగా కొన్ని రోజులు వ్యవహరించారు. ఈ పోస్టు కోసం ఇద్దరు అధికారుల పేర్లు బలంగా వినిపించాయి. అయినప్పటికీ వారిని కాదని అనూహ్యంగా డైట్ అధ్యాపకుడిని డీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఇక్కడ డీఈవోగా పనిచేసిన డి.సుభద్రను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

నీటికి నికరంపల్లిగా మారుద్దాం

- వెయ్యి అడుగుల లోతుకు జలాలు
- వృద్ధికి కదిలిన అధికారులు



మార్కాపురం, న్యూస్‌టుడే:

వర్షాభావ పరిస్థితులు.. 'కన్నీటి' కష్టాలు పశ్చిమ ప్రకాశానికి నిత్యకృత్యం. ఇక్కడి పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పాతాళం వైపు పరుగులు తీస్తుంటాయి. వేసవిలోనే కాదు.. ఏడాది పొడవునా ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి. భూగర్భ జల వనరుల లభ్యత తక్కువగా ఉండటంతో కొన్ని గ్రామాల్లో ఏకంగా కొత్త బోర్ల ఏర్పాటు పైనే నిషేధం విధించాల్సిన దుస్థితి. ఇలాంటి దయనీయ పరిస్థితులపై అధికార యంత్రాంగం స్పందించింది. వర్షపు నీటిని ఒడిసి పట్టి పాతాళ గంగను పైకి తీసుకురావాలనే బృహత్తర ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు మొదటి విడతగా మార్కాపురం మండలంలోని నికరంపల్లి పంచాయతీని ఎంపిక చేసింది. భూగర్భ జలాల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. గ్రామ సభ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాత పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకుగాను సర్పంచి గోగిరెడ్డి పార్వతమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్ అబిద్ హుసేన్ గ్రామంలో పర్యటించి నివేదికలు సిద్ధం చేశారు.

నిరుపయోగ చిత్రం...

● నికరంపల్లి గ్రామంలో 15 వరకు డీప్ బోర్లుండగా ప్రస్తుతం ఏడు పని చేస్తున్నాయి. వీటికి 450- 500 అడుగుల లోతులో నీరు లభిస్తోంది. ● డీప్ బోర్ల నుంచి వచ్చిన నీటితో ట్యాంకర్లు నింపి గ్రామస్థులకు సరఫరా చేస్తున్నారు. ● 90 వరకు వ్యవసాయ బోర్లుండగా అందులో 70 మాత్రమే అరకొరగా పనిచేస్తున్నాయి. వాటికి కూడా 1,000 నుంచి 1,050 అడుగుల లోతున నీరందుతోంది. వేసవిలో ఇవి కూడా నిరుపయోగంగా మారుతున్నాయి.

ఇదీ చేసే ప్రయత్నం...

● భూగర్భ జలాలు పాతాళానికి పరుగులు తీసిన ఈ గ్రామంపై జిల్లా అధికారులు ఇప్పుడు ప్రత్యేక దృష్టిసారించారు. వాన నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు వృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇందుకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు. ● కొండ వద్ద కందకాలు తవ్వుతారు. ● పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తారు. ● వాగులపై చెక్ డ్యాంలు నిర్మిస్తారు. ● ఒట్టిపోయిన వ్యవసాయ, గ్రామంలోని బోర్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మాణం చేపడతారు. వీటితోపాటు ప్రతి ఇల్లు, ప్రభుత్వ భవనాల వద్ద ఏర్పాటు చేసుకునేలా చూస్తారు.

గ్రామ స్వరూపమిలా...

పురుషులు:	965
స్త్రీలు:	875
మొత్తం జనాభా	1,840
మొత్తం గృహాలు:	478
వ్యవసాయ భూమి:	765 ఎకరాలు

అభివృద్ధికీ వేయనున్నారు 'బాటలు'...: నికరంపల్లిలో ప్రస్తుతం 70 శాతం సీసీ రహదారులు ఉన్నాయి. మిగిలినవి కూడా నిర్మించి వంద శాతం పూర్తిచేస్తారు. పారిశుద్ధ్యం మెరుగుకు మురుగు కాలువలు నిర్మిస్తారు. గ్రామం మొత్తాన్ని స్వచ్ఛంగా ఉంచేలా, మొక్కలు నాటి సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రచార కార్యక్రమాలు చేపడతారు. అవకాశం ఉన్న చోట ఉద్యాన వనాలు ఏర్పాటు చేస్తారు.


లెక్క తేలుద్దాం

- పశు గణనకు సర్వం సిద్ధం
- నేటి నుంచి సర్వేకి సమాయత్తం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

జిల్లాలో పశువుల లెక్క తేల్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జాతీయ పశు గణనలో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్గదర్శకాలను అనుసరించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అందుకోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. తొలుత సెప్టెంబర్ 1న ప్రారంభించడానికి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనివార్య కారణాలతో వాయిదా పడింది. తాజాగా పశువులు, జీవాలు, గుర్రాలు, ఒంటెలు, పందులు, కుందేళ్లు, బాతులు, కుక్కలు, ఇతర జంతువులు, కోళ్లు తదితరాలు కలిపి మొత్తం 16 రకాల పశువులను లెక్కించనున్నారు. రైతు ఇంటి వద్దనే అన్నింటినీ గణించి అంతర్జాలంలో నమోదు చేస్తారు. దీంతోపాటు, పశు సంవర్ధక శాఖ అందజేసిన సామగ్రిని కూడా గణిస్తారు.

పథకాల అమలుకు కీలకం...: రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పశు సంవర్ధక శాఖ నుంచి ఏకంగా 11 శాతం ఆదాయం లభిస్తోంది. జిల్లాలో పశుపోషణపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు మూడు లక్షల మందికి పైగా ఆధారపడి జీవిస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా చేపట్టనున్న పశు గణన దోహదపడనుంది. మరో పక్క పశుపోషకుల ద్వారా ఒనగూరే ఆదాయం పెంచేందుకు., వారి అవసరాల రీత్యా పథకాలను కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది. నాలుగు నెలలకు పైగా చేపట్టనున్న గణనకు ప్రత్యేకంగా యాప్ రూపొందించారు.



జిల్లాలో ప్రస్తుతం పశువుల సంఖ్య ఇలా...

తెల్ల పశువులు	నల్ల పశువులు	గొర్రెలు	మేకలు	కోళ్లు
56,332	6,71,812	15,67,122	4,17,589	8,33,434

ప్రత్యేక సిబ్బంది నియామకం...

పశు గణనకు 348 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. వీరిలో పశు సంవర్ధక సహాయకులు, పారా సిబ్బంది, గోపాలమిత్రలు ఉన్నారు. మరో 71 మంది పశు వైద్యాధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. ఈ ప్రక్రియ అనంతరం సూపర్‌వైజర్లు ఆయా వివరాలను పరిశీలిస్తారు. ఎలా గణించాలనే విషయమై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిణి బేబీరాణి ఈ ప్రక్రియనంతటినీ పర్యవేక్షిస్తారు.

పీడీసీసీబీ సీఈవో మాకొద్దు

- ఆప్కాబ్ ఎండీకి కలెక్టర్ లేఖ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(పీడీసీసీబీ) సీఈవో కోటిరెడ్డిపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఆయనపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సదరు అధికారిని విధుల నుంచి తొలగించండి' అని ఆప్కాబ్ ఎండీకి కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం లేఖ రాశారు. కోటిరెడ్డి వైకాపా ప్రభుత్వ హయాంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. అందుకు సంబంధించి సహకార శాఖ ఉన్నతాధికారులు, ఆప్కాబ్, విజిలెన్స్, లోకాయుక్త, కలెక్టర్, ప్రజాప్రతినిధులకు దాదాపు 12 వరకు ఫిర్యాదులు అందాయి. ఉద్యోగోన్నతులు, పోస్టుల కేటాయింపు, రుణాల మంజూరు, కార్యాలయం ఆధునికీకరణ పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ అందులో పేర్కొన్నారు. స్పందించిన ఉన్నతాధికారులు వాటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతున్నందున కోటిరెడ్డిని సరెండర్ చేయాలని, ఆయన కొనసాగితే రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం ఉంటుందని, విచారణ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు వీలుండని ఆప్కాబ్ ఎండీకి రాసిన లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు.

డిసెంబర్‌లోగా పంటల బీమా చేయించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో జేసీ గోపాలకృష్ణ తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 2024-25 సంవత్సరానికి రబీ సీజన్‌లో వరి పంటకు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా రైతులు పంటల బీమా చేయించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. జిల్లాలో సాగు చేస్తున్న పంటలు, వాటికి బీమా అమలుపై స్థానిక ప్రకాశం భవన్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జొన్న, శనగ, మినుము, మొక్కజొన్న, మిరప పంటలకు మాత్రం డిసెంబర్ 15లోగా ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియాన్ని చెల్లించేలా చూడాలన్నారు. పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రీమియం నగదును బ్యాంకులు మినహాయించుకునేలా రైతుల అంగీకారం తెలపవచ్చని సూచించారు. రుణాలు తీసుకోని వారు విడిగా కూడా చెల్లించవచ్చన్నారు. బీమా అనేది స్వచ్ఛందమని స్పష్టంచేశారు. ఈ గడువు తేదీలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సీపీవో వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత అమరావతి నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఇతర అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.

అర్చక పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించే అర్చక పరీక్షల దరఖాస్తులు అందజేసే గడువును ఈ నెల 31 వరకు పొడిగిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ (అర్చక) సంఘం జిల్లా అధ్యక్షుడు పణతుల మాధవశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘం అధ్యక్షుడు మురిమళ్ల రాంబాబు, ఐకాస నాయకులు కమిషనర్ సత్యనారాయణను కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ ఈ నెల 31వ వరకు దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించారన్నారు. నలభై సంవత్సరాలు దాటిన వారు మౌఖిక పరీక్షకు హాజరు కావచ్చని, రాత పరీక్షకు మినహాయింపు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అర్చకులు, వేదాధ్యాయ ఆసక్తి ఉన్నవారు వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

ఉచితంగా వినికిడి యంత్రాలందిస్తాం

ఒంగోలు నగరం: వినికిడి సమస్య ఉన్నవారికి రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం, దీనదయాళ్ స్వర ఫౌండేషన్ ద్వారా ఉచితంగా యంత్రాలు అందజేయనున్నట్లు జిల్లా సమన్వయకర్త డాక్టర్ భగీరథ పేర్కొన్నారు. అర్హులైన వారు శుక్రవారం జీజీహెచ్‌లోని బాలల సత్వర చికిత్స కేంద్రానికి రావాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, వినికిడి పరీక్ష రిపోర్టు తప్పనిసరి అన్నారు. సందేహాలున్నవారు 995928 6963కు సంప్రదించాలన్నారు.

అమూల్య జలం కడలి పరం



టంగుటూరు మండలం ఎం.నిడమానూరు వద్ద ముసి వాగు ఉధృతి

- ముసి, పాలేరుల్లో చెక్‌డ్యాంలు లేక నిలవని నీళ్లు
- సుమారు రెండు టీఎంసీల వరకు వృథా

వర్షాలు లేనప్పుడు అయ్యో వరుణుడు కరుణించడేమో అని నిట్టూర్చుతాం. తీరా వానలు పడి సమృద్ధిగా జలాలు వచ్చినా వాటిని ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోలేకపోతున్నాం. కొండపి నియోజకవర్గంలో కళ్లెదుటే అనేక క్యూసెక్కుల నీళ్లు కడలి పాలవుతున్నా చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. ముసి, పాలేరు వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించి జలప్రవాహానికి అడ్డుకట్ట వేసి అనంతరం ఆ నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉన్నా.. గత పాలకులు దృష్టిచూపని కారణంగా వర్షపునీరంతా సముద్రం పాలవుతోంది.

న్యూస్‌టుడే, టంగుటూరు, కొండపి గ్రామీణం: కొండపి నియోజకవర్గంలో పాలేరు, ముసి వాగులు సుమారు 150 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నాయి. ముసి వాగు కంభం సమీపంలోని ఎర్రఒబనపల్లె వద్ద పుట్టి దర్శి, తాళ్లూరు, పొదిలి, చీమకుర్తి, కొండపి, సంతనూతలపాడు, టంగుటూరు, జరుగుమల్లి మండలాల మీదుగా ప్రవహిస్తోంది. వర్షాలు పడినపుడు ఉగ్రరూపం దాల్చడంతో పలు మండలాల రాకపోకలు సైతం నిలిచి పోతుంటాయి. వానలు లేనప్పుడు చుక్కనీరు నిలవక ఎడారిలా వెలవెలబోతుంది. ఈ వాగు పరిధిలో లక్ష ఎకరాల భూములను రైతులు సాగుచేస్తున్నారు. బెట్టకొచ్చిన పంటలకు నిల్వ ఉన్న కొద్దిపాటి నీటిని అందించి కాపాడుకుంటారు. గతంలో అక్కడక్కడ చెక్‌డ్యాంలను నిర్మించారు. కొండపి, టంగుటూరు, జరుగుమల్లి మండలాల పరిధిలో నాలుగు మాత్రమే ఉన్నాయి. వీటి సంఖ్య మరింత పెంచాల్సి ఉంది. కొండపి మండలం మద్దులూరు, అనకర్లపూడి, రేగలగడ్డపాలెం, పోడవరం, ముప్పవరం, టంగుటూరు మండలం పొందూరు, ఎం.నిడమానూరు, కారుమంచి, జయవరం, కాకుటూరివారిపాలెం, జమ్ములపాలెం, తూర్పు నాయుడుపాలెం, ఆలకూరపాడు, అనంతవరం గ్రామాల సమీపంలో కొత్తగా 14 చెక్‌డ్యాంలు నిర్మించాల్సి ఉంది. ముసికి సాగర్ నీటిని విడుదల చేయాలని, దీంతోపాటు చెరువులను నింపాలని టంగుటూరుకు చెందిన 'ముసికి సాగర్ నీరు సాధన సంఘం' ఇదివరకే డిమాండ్ చేసింది. వాగులు పొంగిపొర్లిన సమయంలో సుమారు 2 టీఎంసీల వరకు నీరు సముద్రంలో కలుస్తుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

నీటి సద్వినియోగానికి ప్రణాళికలు..

కొండపి నియోజకవర్గంలోని పాలేరు, ముసి వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. వృథా అవుతున్న నీటిని నిల్వ చేసి రైతులకు మేలు చేకూరేలా ఆలోచనలు చేస్తున్నాం. సముద్రం పాలవుతున్న నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు ఇంకిపోకుండా, మెట్టపంటలు నీరు వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేస్తాం.

-డోలా బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

చొరవ తీసుకుంటేనే...

పాలేరు వాగు వెలిగండ్ల మండలం పందువ గ్రామంలో పుట్టి వెలిగండ్ల, పీసీపల్లి, కనిగిరి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల మీదుగా ప్రవహించి టంగుటూరు మండలం పసుపుగల్లు వద్ద సముద్రంలో కలుస్తోంది. సుమారు 165 కి.మీ దూరం ప్రవహిస్తోంది. కొండపి నియోజకవర్గం పరిధిలో అధికంగా జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో ప్రవహిస్తూ వ్యవసాయ, తాగునీటి అవసరాలను తీరుస్తోంది. దీని పరిధిలో సుమారు 16 వరకు చెక్‌డ్యాంలు నిర్మించాలని ఆయా మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు. అయినా ఇంత వరకు ఎవరూ చొరవ తీసుకోలేదు.



టంగుటూరు మండలం రావివారిపాలెం వద్ద పొంగిపొర్లుతున్న పాలేరువాగు



వాగులా ఉన్న దువ్వలి–అడ్డరోడ్డు రహదారి



అధ్వానంగా ఉన్న మేడపి–ఎండూరివారిపాలెం మార్గం

నిధుల వరద.. మిగిలింది బురద

- వెంటాడుతున్న వైకాపా వైఫల్యం

కోట్ల రూపాయల నిధులున్నా..వైకాపా అసమర్థ పాలనతో అవస్థలే మిగిలాయి. గత తెదేపా హయాంలో మేడపి-ఎండూరివారిపాలెం రహదారి ఆధునికీకరణకు రూ.కోటి మంజూరవ్వగా..ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం శంకుస్థాపనలతోనే కాలం వెళ్లదీసింది. రెండు గ్రామాల శివారు వరకు తారు రోడ్డు వేసి ఎండూరివారిపాలెంలో సీసీ వేయకపోవడంతో వానొస్తే వాగును తలపిస్తోంది. దువ్వలి - అడ్డరోడ్డు నిర్మాణానికి గత తెదేపా హయాంలో రూ.3 కోట్లు మంజూరయ్యాయి. అయితే వైకాపా ప్రభుత్వం కొలువుదీరాక కంకర డస్టు వేసి తారు పోయడం మరిచారు. దీంతో చిన్నపాటి వర్షమొచ్చినా వాగును తలపిస్తోంది. దీంతో ఆ మార్గంలో వచ్చే విద్యార్థులు, రైతులకు నరకయాతన తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

భుజంగేశ్వర ఆలయ దుకాణాల స్వాధీనం

- పామూరులో ఉద్రిక్తత

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయానికి చెందిన దుకాణాల తొలగింపు సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ దాదాపు 35 ఏళ్ల నుంచి వారు దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. ఇక్కడ దుకాణదారులు ఆలయానికి నామమాత్ర చెల్లింపులు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై గతంలో 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.పానకాలరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా వారు ససేమిరా అనడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అక్కడ 12 దుకాణాలుండగా ఒకటి మినహా మిగతావి ఖాళీ చేయించారు. 4వ నంబరు దుకాణం నిర్వాహకుడు కోర్టు నుంచి స్టే తేవడంతో దాన్ని స్వాధీనం చేసుకోలేదు. కార్యక్రమంలో ఏసీ కార్యాలయం పర్యవేక్షకులు శ్రీధర్‌రెడ్డి, ఈవోలు ఎస్.నరసింహబాబు, వంశీకృష్ణారెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ. సీఐ ఎం.భీమానాయక్, ఎస్సైలు టి.కిషోర్‌బాబు, మధుసూదన్, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ అధికారులను నిలదీస్తున్న దుకాణదారులు



దుకాణానికి సీల్ వేస్తున్న ఆలయ సిబ్బంది

సమగ్రశిక్ష సెక్టోరల్ ఉద్యోగాలకు 58 దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 58 దరఖాస్తులు అందినట్లు డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. అయిదు సెక్టోరల్ అధికారులు, ఓ అసిస్టెంట్ సెక్టోరల్ అధికారి ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలో ఫారన్ సర్వీసుపై పనిచేయడానికి ఆసక్తిగల ఉపాధ్యాయులు దరఖాస్తులు సమర్పించారన్నారు. సీఎంవో పోస్టుకు 17, ఐఈ కోఆర్డినేటర్‌కు 8, ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్‌కు 14, జీసీడీవో పోస్టుకు రెండు, ప్లానింగ్ కోఆర్డినేటర్‌కు 9, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌కు 8 దరఖాస్తులు అందాయన్నారు.

ఉపాధ్యాయులకు నేడు ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు నగరం: జిల్లాలోని హెచ్ఎంలు, టీచర్లకు శుక్రవారం ప్రాశస్త మొబైల్ యాప్‌పై ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు అవగాహన కల్పిస్తామన్నారు. స్పెషల్ టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, డైట్ సిబ్బంది తప్పక హాజరుకావాలన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రేషన్ సరకుల పంపిణీ, సరఫరాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత సమర్థంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ సరకుల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులొస్తే, పరిష్కరించాన్నారు. సమావేశంలో డీఎస్వో పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న పాత నేరగాళ్ల ముఠా అరెస్టు

- 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య తదితరులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న పాత నేరగాళ్ల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయితో పాటు పదమూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పరిధిలోని జాతీయ రహదారి వద్ద చోటు చేసుకుంది. స్థానిక సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కుంభా గోపి, ఉయ్యాల రవి, బాపట్ల జిల్లా .జె.పంగులూరుకు చెందిన వాసుబాబు, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చుక్కా నాగ గోపీచంద్, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాలకు చెందిన కోడూరి సుబ్బారెడ్డి గతంలో పలు కేసుల్లో శిక్ష అనుభవించారు. ఇటీవల కాలంలో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి జిల్లాకు తరలించి యువతకు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం గోపి, రవి ఒడిశా నుంచి రెండు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. వారు గురువారం సింగరాయకొండ పరిధిలోని పోలేరమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించగా, ముఠాలోని మరో ముగ్గురు సభ్యుల వివరాలు తెలిపారు. ఈ మేరకు అయిదుగురు పాత నేరగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి, 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7 లక్షలుంటుందన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై మహేంద్ర, ఏఎస్సై బాషా, సిబ్బంది రమేష్, సుమన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు గృహ సందర్శన

ఒంగోలు నగరం: వ్యాధుల నివారణ కోసం శుక్రవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సిబ్బంది గృహ సందర్శన ద్వారా బాధితుల సమాచారం సేకరించాలన్నారు. దీనిపై గురువారం ప్రోగ్రాం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. గృహ సందర్శనకు వెళ్లిన వారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే ఆసుపత్రికి పంపించి వైద్య చికిత్స అందించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం లోపు జిల్లా కేంద్రానికి సమాచారం పంపాలన్నారు. గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి పైపులు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి, లీకులుంటే అరికట్టాలన్నారు. వ్యాధి తగ్గుముఖం పట్టిన వారు డాక్టర్ అనుమతితోనే ఇంటికి వెళ్లాలన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కురిచేడు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కురిచేడులో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేడు గ్రామానికి చెందిన అంకె ఏడుకొండలు(36) గురువారం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లారు. మోటారు స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఏడుకొండలు భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు.



అంకె ఏడుకొండలు (పాత చిత్రం)

డెంగీ కేసు నమోదు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ యల్లయ్య నగర్‌లో డెంగీ కేసు నమోదు కావడంతో ఆయా శాఖల వారు అప్రమత్తమయ్యారు. కాలనీలో నివసిస్తూ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇతను డెంగీ బాధితుడు కావడంతో వైద్య ఆరోగ్య శాఖ గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 128, రిటైల్ లైవ్ - 150, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 248

విధి వంచితపై వ్యాపారి దాడి

- వీడియో వైరల్
- నిందితుడి అరెస్టు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని వృద్ధ మహిళపై ఓ వ్యాపారి విచక్షణారహితంగా కర్రతో దాడిచేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. ఒంగోలు ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మతిస్థిమితం లేని అరవై ఏళ్ల వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి అక్కడి పండ్ల రసాలు విక్రయించే షాపు ముందు నిద్రకు ఉపక్రమించారు. దీనికి అభ్యంతరం చెబుతూ దుకాణదారు ఆర్.నాగరాజు ఆమెపై కర్రతో దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఆ సమయంలో బస్టాండ్‌లో ప్రయాణికులున్నా ఎవరూ వారించే ప్రయత్నం చేయలేదు. దెబ్బలకు తాళలేక బాధితురాలు కేకలు వేస్తున్నా అతను శాంతించలేదు. ఈ సంఘటనను బస్టాండ్‌లో ఉన్న ఓ వ్యక్తి వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో స్పందించిన ఒకటో పట్టణ పోలీసులు నిందితుడు ఆర్.నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. తొలుత ఆమె తనపై దాడి చేసిందని, దీంతో తాను ఆమెను కొట్టానని నాగరాజు చెబుతున్నారు. బాధితురాల్ని వైద్యచికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

ఆందోళన చెంది.. ఉరికి వేలాడి..



పోచాలు (పాత చిత్రం)

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: స్వల్ప విషయానికి ఆందోళనకు గురై ఓ ఆటో చోదకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ముటుకుల పంచాయతీలోని తెల్లగట్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తెల్లగట్లకు చెందిన చిలకాబత్తిన పోచాలు(19) ఆటో చోదకుడు. గురువారం కూలీలను ఆటోలో తీసుకెళ్లి ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలో మరో ఆటోకు తగిలింది. ఇదే విషయాన్ని అతను ఇంటికొచ్చిన తర్వాత తల్లిదండ్రులకు తెలపగా, వారు ఆందోళన చెందవద్దని చెప్పి వారి వారి పనులకు వెళ్లిపోయారు. అనంతరం పోచాలు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని యర్రగొండపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.

కాలువలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం

దర్శి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో సాగర్ కాలువలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ రఫీ, సాదియా దంపతులు. రఫీ బేల్దారి మేస్త్రిగా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలు వెంటాడటంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రఫీ బుధవారం భార్యకు ఫోన్ చేసి సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పారు. కురిచేడు రోడ్డుకు సమీపంలో ఆయన కాలువలో దూకగా, మృతదేహం పొదిలి రోడ్డు సమీపంలో గురువారం గుర్తించారు. మృతదేహాన్ని ఎస్సై మురళి పరిశీలించి శవ పరీక్ష నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సాదియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రఫీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మురళి




గిద్దలూరు : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుమలయ్య, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

గిద్దలూరు పట్టణం: : గిద్దలూరు నగర పంచాయతీ అనూష పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ ప్రతిభా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎస్.కె.సుహానా, డి.రిచర్డ్ లేవా, ఎం.గాయత్రి వరుస బహుమతులు దక్కించుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.తిరుమలయ్య, ఉపాధ్యాయులు రవి, సుబ్రమణ్యం, తిరుపాల్‌రెడ్డి, మధు, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

మార్కాపురం: మండలంలోని రాయవరంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8-10వ తరగతి విద్యార్థులకు గురువారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై చేపట్టిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో కె.కావ్యశ్రీ(10వ తరగతి) ప్రథమ, ఎం.ధనుష్(9వ తరగతి)ద్వితీయ, డి.కమల(10వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ బహుమతులు అందజేశారు.




మార్కాపురం : రాయవరంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు, గెలిచిన వారితో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

కొనసాగుతున్న కార్మికుల నిరసన

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: అధికారులు మొండి వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం కొనసాగింది. కారణం లేకుండా మున్సిపాలిటీలో పనిచేస్తున్న 20మంది సిబ్బందిని తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు.



నిరసన దీక్షలో సీఐటీయూ నాయకులు, కార్మికులు

అతివేగం.. తీస్తోంది ప్రాణం


- వారం రోజుల క్రితం పొదిలి పెద్ద బస్టాండ్‌లో ఓ టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో భారీకేడ్లను, మరో వాహనాన్ని ఢీ కొట్టాడు. అదృష్టవశాత్తు ఆ సమయంలో రద్దీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.
- ఇటీవల పొదిలి-గిద్దలూరు రహదారిపై పోతవరం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో కంభాలపాడుకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.
- పొదిలి-దర్శి మార్గంలో సాయంత్రం పూట చికెన్ తెచ్చుకుందామని బయటకు వచ్చిన యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- పొదిలి-ఒంగోలు మార్గంలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలు గాయపడ్డారు. అదృష్టవశాత్తు పూర్తిగా బోల్తా పడి ఉంటే ప్రాణనష్టం జరిగేది.

☛ మృత్యు రహదారిగా నడికూడలి

పొదిలి, న్యూస్‌టుడే:

పొదిలి ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అతివేగం... మద్యం తాగి వాహనాలు నడుపుతుండటంతో తమతోపాటు ఎదురుగా వచ్చే వారు సైతం బలవుతున్నారు. త్వరగా గమ్యం చేయాలనే ఆతృత, ఆలస్యమైతే ఏమవుతుందోననే ఆందోళన, వెళ్లాల్సిన వేగం కన్నా అధికవేగంతో వాహన చోదకులు ప్రమాదాల కు కారణమవుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యంతో జరిగే ప్రమాదాలు ఆ కుటుంబాలను శోకసముద్రంలో ముంచేస్తున్నాయి. నడి కూడలిలోని ఈ మార్గాల్లో గుంతలు, మార్జిన్లలో గోతులు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రిపూట గుంతలను తప్పించ బోయి వాహనాలు అదుపు తప్పి కొన్నిచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

గత ఏడాది కాలంలో
చోటు చేసుకున్న ప్రమాదాలు : 100
చనిపోయినవారు : 29 మంది
గాయపడ్డవారు: 160 మంది



చేపట్టాల్సిన చర్యలు ఇవీ..

పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి, వాహనం పూర్తిగా ఫిట్‌నెస్ లేని వారిపై ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆ దిశగా వారు దృష్టి సారించడం లేదు. ఏదో పెద్ద ప్రమాదం జరిగితే ఆ రోజు వచ్చి ఓ మార్గంలో కొన్ని కేసులు రాసి వెళ్తున్నారు. గతంలో జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరిగే మార్గాల్లో స్పీడ్ గన్లు ఏర్పాటు చేసేవారు. వాటితో అధిక స్పీడుతో వెళ్తే వాహనాలకు ఆటోమెటిక్‌గా జరిమానా పడేది. దీంతో కొంత వరకు అతివేగం నిర్మూలించే అవకాశం ఉంది.

జరిమానాలు విధిస్తున్నాం

పొదిలి సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రాస్తున్నాం. వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ కొంతమంది ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు మావంతు కృషి చేస్తున్నాం.
– టి.వెంకటేశ్వర్లు,సీఐ, పొదిలి



పొదిలి–గిద్దలూరు మార్గంలో పోతవరం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు (పాతచిత్రం)

వాహనాల సైరన్ల తొలగింపు

జూబ్లీహిల్స్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యేలకు సంబంధించిన వాహనాలకు సైరన్లను గురువారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పేరుతో స్టిక్కర్ ఉన్న వాహనం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ప్రయాణిస్తున్న క్రమంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై గోపి వాహనాన్ని ఆపి సైరన్‌ను తొలగించారు. జూబ్లీహిల్స్‌లోని మరో ప్రాంతంలో కందుకూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే మహీధరరెడ్డి వాహన సైరన్‌ను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తొలగించారు. వాహనదారులకు రూ.1000 చొప్పున చలానా విధించారు.

భారీగా బాణసంచా పట్టివేత

మార్కాపురం: ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివేకానంద స్కూల్‌కు సమీపంలో ఉన్న వేముల సత్యంకు చెందిన రేకుల షెడ్డులో భారీ స్థాయిలో దీపావళి కార్కర్స్ ఉన్నట్లు సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై సైదుబాబు సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీ కొని.. గాయాలు

కొమరోలు (గ్రామీణం) : జాతీయరహదారిపై ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటన గురువారం చోటుచేసుకుంది. అలసందలపల్లెకు చెందిన మింగి నాగేశ్వరరావు దద్దవాడ వైపు రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతుండగా ద్విచక్రవాహన చోదకుడు వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. గాయపడ్డ నాగేశ్వరరావును గిద్దలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

త్రిపురాంతకం గ్రామీణం : మండలంలోని గణపవరం జడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.కృష్ణ సరిత, ఎల్.వెంకట రజిత, పి.స్వాతి, ఎన్.వైష్ణవి రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఏడుకొండలు, పీడీ డి.బాలరాజు తెలిపారు. వీరు నవంబరు 2 నుంచి అనకాపల్లిలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం ఏడుకొండలు, పీడీ బాలరాజు, ఉపాధ్యాయులు →



వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం బేస్తవారపేటలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య అధ్యక్షతన సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెలిగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో, 29న ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందె నాసరయ్య, కేవి రమణ, జోసెఫ్, యోగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పొదిలి : పొదిలి పెద్దబస్టాండ్ సమీపంలో ఉన్న మరుగుదొడ్లను ప్రైవేటు వ్యక్తులు కూల్చిన విషయం విధితమే. నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ముందు భాగం కంచె ఏర్పాటుచేశారు. ఆ స్థలంలో ఇది నగర పంచాయతీ స్థలం, ఎవరైన ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు పెట్టారు. ఎంతో విలువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు వెనుకభాగంలో ఉన్న స్థలాన్ని బూచిగా చూపి స్వాధీనం చేసుకునేందుకు పలుమార్లు ప్రయత్నించారు. వారిపై పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఎట్టకేలకు ప్రస్తుత నగర పంచాయతీ కమిషనరు పి.శ్రీనివాసరావు చొరవ చూపి ఆ స్థలాన్ని కాపాడటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల పరిశీలన

మార్కాపురం : కాలువ దాటి బయటకు వచ్చిన వారి అందరికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారని.. వారందరూ వెనక్కి వెళ్లాల్సిందేనని ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ఆక్రమణదారులకు సూచించారు. మార్కాపురం పట్టణంలో గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నుంచి మార్కాపురం-కంభం రహదారి వరకు కాలువకు దాటి బయటకు వచ్చిన దుకాణాలు, వ్యాపార సముదాయాలను ఉప కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్, పోలీసుశాఖ అధికారులు పరిశీలించారు. కాలువ దాటి ఆక్రమణ చేసి ముందుకు వచ్చిన వారి దుకాణాలకు మార్కింగ్ చేశారు. అనంతరం ఉప కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసి ఉంటే తొలగించాల్సిందేనని పేర్కొన్నారు.



ఆక్రమణలకు మార్కింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వసతి గృహాల తనిఖీ

మార్కాపురం, కంభం: మార్కాపురం ఎంపీడీవో వై.భాగ్యవతి, ఎంఈవో-2 తూంబేటి శ్రీనివాసులు మార్కాపురం మండలంలోని రాయవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను, బీసీబాలికల గురుకులాన్ని, వసతిగృహాలను తనిఖీ చేశారు. అక్కడి అధ్వాన పరిస్థితులను ఫొటోలు తీసి అధికారులకు పంపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రికార్డులను, మిట్టమీదపల్లెలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ● కంభం పట్టణంలోని వసతిగృహాలను, పాఠశాలలను ఎంపీడీవో వీరభద్రాచారి, ఎంఈవో-1 మాల్యాద్రి తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

కంభం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలో కందులాపురం పరిధిలోని వాల్మీకి నగర్‌లో సిమెంట్ రహదారిపై నీరు నిలిచి ఉంది. దాంతో రాకపోకలకు స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నిలిచిన జలం తొలగించాలి. – సురేష్, స్థానికుడు



సమాధానం : సిబ్బందిని పంపించి రహదారిపై నిలిచిన నీటి తొలగింపజేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– జోష్యులు, పంచాయతీ కార్యదర్శి, కందులాపురం

బస్సు సమయాన్ని మార్చాలని వినతి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు డీఎం జె.సుందరరావు దృష్టికి తీసుకొచ్చారు. కొనకనమిట్ల మండలం నాయుడుపేట గ్రామానికి రెండో ట్రిప్పు వెళ్లే బస్సు పొదిలిలో 8.15 గంటలకు బయలుదేరుతుందని, ఆ మార్గంలో వెళ్లే ఉపాధ్యాయులు ఆ బస్సుకు వెళ్లేసరికి ఉదయం 9.15 అవుతోందని, 9 గంటల లోపే బయోమెట్రిక్ వేయాల్సి ఉన్నందున ఆ సర్వీసును పది నిమిషాల ముందుకు మార్చాలని ఉపాధ్యాయురాలు ఎన్. భవాని డీఎం దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలిస్తామని డీఎం హామీ ఇచ్చారు. నలుగురు ఫోన్‌చేయగా నలుగురు ప్రయాణికులు అదే మార్గంలో నడిచే అదే బస్సు సమయాన్ని మార్చాలని కోరారు. వాటిని పరిశీలించి మారుస్తామని డీఎం చెప్పారు.

వ్యాస రచన పోటీలు

యర్రగొండపాలెం పట్టణం, కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు నేరాలు ఎలా అరికట్టాలి అనే అంశంపై పోలీసులు అవగాహన కలిగించారు. ● రాచర్ల స్పందన పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

ఆకట్టుకున్న మహిళా మార్ట్ ప్రదర్శన

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ ప్రదర్శన ఆకట్టుకుంది. స్వయం సహాయక సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను గురువారం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్.నారాయణరావు, నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ సదుపాయాలను మెరుగుపరచుకొని మహిళలు వ్యాపార పురోభివృద్ధి సాధించాలని సూచించారు.



మార్ట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

❑ తొమ్మిదేళ్ల తర్వాత శ్రీకారం ❑ ఓటర్ల జాబితా తయారీలో యంత్రాంగం

చెరువుల అభివృద్ధికి సాగు నీటి సంఘాలు ఎంతో కీలకం. అలాంటి సంఘాల ఎన్నికను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఎన్నికలు నిర్వహించకుండా వాటిని రాజకీయ పునరవాస కేంద్రాలు మార్చివేసింది. దీంతో నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే చెరువులకు ఊపిరి పోయడానికి సిద్ధమైంది.. తొమ్మిది ఏళ్ల తర్వాత ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల 21 వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మార్కాపురం, కొమరోలు గ్రామీణం

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఉన్న 13 మండలాల్లో 117 సాగు నీటి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో ఉన్న ఆయకట్టు కింద ఉన్న రైతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఏ ఆయకట్టు కిందట రైతులకు భూమి ఉన్న వారికి ఓటు కల్పించేందుకు జలవనరులశాఖతో పాటు రెవెన్యూ అధికారులు ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. మార్కాపురంలో 8 సంఘాలు, తర్లుపాడులో 4, దోర్నాలలో 10 సాగు నీటి సంఘాలు, పెద్దారవీడులో 8 సంఘాలు, పుల్లల చెరువులో 10, త్రిపురాంతకంలో 8 సంఘాలు ఉన్నాయి. యర్రగొండపాలెంలో 6 సంఘాలు, గిద్దలూరులో 10, రాచర్లలో 10, కొమరోలులో 10 సంఘాలు ఉన్నాయి. బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాల్లో 21 సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు అన్ని నోటిఫికేషన్లు జారీ చేశారు. అన్ని సంఘాల పరిధిలో ఉన్న రైతులను తయారు చేసి ఓటర్ల జాబితాను తయారు చేసి గ్రామ సచివాలయం పరిధిలోని నోటీసు బోర్డులతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు.



మార్కాపురం పట్టణంలోని చెరువు

ఎన్నుకుంటారు ఇలా: ఎక్కువగా శాతం రైతులు అందరూ చేతులు ఎత్తడం ద్వారా సంఘం సభ్యులను ఎన్నుకుంటారు.. ఒక్కొక్క సాగు నీటి సంఘం పరిధిలో ముందుగా రైతులు అందరూ ఆరు మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఆ తర్వాత వారు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మిగిలిన నలుగురు సభ్యులు ఈసీ సభ్యులుగా ఉంటారు. ఎన్నిక పూర్తయిన తర్వాత వీరు ప్రభుత్వం నుంచి నిధులను రైతుల ఆమోదంతో ఖర్చు చేసి చెరువు అభివృద్ధికి కృషి చేస్తారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. పాఠశాలలో ఎన్‌సీసీలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు సుబేదార్ నిర్భయ్‌సింగ్, హవల్దార్ బి.సుధీర్‌లు పాఠశాల స్థాయిలో 'ఏ' సర్టిఫికెట్లను అందజేశారు.

'నష్టపోయిన రైతులను ఆదుకుంటాం'

మార్కాపురం : వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మార్కాపురం వ్యవసాయ సహాయకులు డి.బాలాజీనాయక్, మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామంలో రైతులు నష్టపోయిన పంటలను గురువారం పరిశీలించారు.

బ్యాంకు సేవలపై కళాజాత

మార్కాపురం : ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మాల్యవంతునిపాడులో గురువారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని బ్యాంకు సిబ్బంది నిర్వహించారు. కళాజాత ద్వారా బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు.

అనధికార విక్రయాలు జరిపితే చర్యలు

అర్ధవీడు, న్యూస్‌టుడే: అనధికార మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కొండారెడ్డి అన్నారు. మాగుటూరు గ్రామంలో ఇటీవల మద్యం గొలుసు దుకాణానికి దేవుడి పేరిట రూ.7.10 లక్షలతో వేలం నిర్వహించడంతో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. వేలం పాడిన రామసుబ్బయ్యని తహసీల్దారు ప్రసాద్ ఎదుట హాజరుపరచి నగదు పూచీకత్తు పై బైండోవర్ చేశారు. అనంతరం గ్రామంలో తనిఖీలు నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ● **బేస్తవారపేట, కంభం(రాచర్ల):** బేస్తవారపేటలోని ఆర్కే నగర్ జంక్షన్ వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంపై గురువారం ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో తనిఖీ చేశారు. 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు కోటిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాచర్లలోని ఓ కూల్‌డ్రింక్స్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 మద్యం సీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.



మాగుటూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉచితంగా వైద్యసేవలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యాలకు శాంతిరామ్ సూపర్ స్పెషాల్టీ వైద్యశాలకు వైద్యులు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించారు. 30 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు.

రీసర్వే లోపాలపై అర్జీల స్వీకరణ

గిద్దలూరు పట్టణం, కంభం

గత వైకాపా ప్రభుత్వ పాలనలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయి. పలువురు రైతుల భూ విస్తీర్ణాలు తగ్గిపోవడం, ఒకరి భూములు మరొకరి రైతుల ఖాతాలో చేర్చారు. మృతి చెందిన వారి పొలాలను వారి కుటుంబసభ్యుల పేరుతో మార్చాల్సి ఉండగా చనిపోయిన వారితోనే మళ్లీ పాస్‌పుస్తకాలు మంజూరు చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇతరులు కొనుగోలు చేసిన పొలాలను విక్రయించిన వారి పేరుతోనే ఉన్నట్లు చూపడం వంటి తప్పిదాలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీ సర్వే చేసిన గ్రామాల్లో తప్పిదాలను సవరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గిద్దలూరు మండలంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. నరసింహునిపల్లె గ్రామంలో 14 అర్జీలు, గురువారం తిమ్మాపురంలో జరిగిన గ్రామ సభలో కేవలం 4 అర్జీలు మాత్రమే అందాయి. తిమ్మాపురం గ్రామంలో గతంలో రీసర్వే చేసిన సమయంలో పలు తప్పిదాలు జరిగినప్పటికీ కేవలం 4 అర్జీలు మాత్రమే రావడం గమనార్హం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో రీసర్వే గ్రామసభలపై గ్రామాల్లో ప్రజలకు ప్రచారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ● కంభం మండలంలోని నడింపల్లిలో గ్రామంలో గురువారం రీ- సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నలుగురు అర్జీలు సమర్పించారు.

రెవెన్యూ గ్రామం	గ్రామసభ జరిగే తేదీ
త్రిపురాపురం	26
కంచిపల్లె	29
నరవ	05 (నవంబర్)
కొంగళవీడు	07
పాదలకుంటపల్లె	12
ముండ్లపాడు	13



తిమ్మాపురం గ్రామంలో రీసర్వే గ్రామ సభలో తహసీల్దారుకు సమస్యను తెలియజేస్తున్న బాధితురాలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో నిర్వహించిన భూ రీసర్వే అస్తవ్యస్తంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వాటి పరిష్కారానికి తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ ముకుంద హరి ఆధ్వర్యంలో మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రామసముద్రం, విశ్వనాధపురం, మిరియంపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రైతుల నుంచి మంచి స్పందన వచ్చింది. మూడు చోట్ల నుంచి పలు రకాల భూసమస్యలపై 168 అర్జీలు అందాయి.



మిరియంపల్లిలో గ్రామసభపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ ముకుంద హరి

కనిగిరి

● కనిగిరి ● దర్శి ● కొండపి

ముండ్లమూరు, న్యూస్‌టుడే:

సమస్య: మండల కేంద్రమైన ముండ్లమూరులో డీప్ బోరు పైపు కుళాయి వద్ద లీకు కావడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది. నెలల తరబడి ప్రధాన రహదారిపైనే ఈ నీరు ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలి.
– రంగనాయకులు, గ్రామస్థుడు

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
–ఆర్.జనార్దన్, ఎంపీడీవో, ముండ్లమూరు

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని వల్లాయపాలెం ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వర్షాలకు కాలువలు లేక పోవడంతో నీరు నిలిచిపోయింది. –సాల్మన్, కాలనీవాసి

సమాధానం: వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు, నీరు నిలిచిన చోట మట్టితోలి చదును చేయిస్తాం.
–సాంబశివరావు, ఈవోఆర్డీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో ఆసుపత్రిలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఎంపీడీవో రంగసుబ్బారాయుడు సమీక్షించారు. సీహెచ్‌వో వెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ● పొన్నలూరు: వైద్యాధికారి కృష్ణచైతన్య మండలంలోని పలు పాఠశాలలు, వసతి గృహాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పొన్నలూరులోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఇతర వాటిని పరిశీలించారు. ● కనిగిరి: మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారం లేకుండా చూడాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్ పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని కాలువలను కార్మికులతో శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్‌రసూల్, కౌన్సిలర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల గృహాలకు మహర్దశ

● త్వరలో లబ్ధిదారులకు బకాయిల చెల్లింపు ● సర్వే పూర్తిచేసిన అధికారులు



సి.ఎస్.పురంలో సర్వే చేస్తున్న గృహనిర్మాణ సంస్థ ఏఈ హరికృష్ణ

న్యూస్‌టుడే, పామూరు

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 2014-19లో గత తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా పక్కా గృహాలను మంజూరు చేసింది. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు సైతం చెల్లించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం తెదేపా హయాంలో నిర్మించిన పేదల ఇళ్ల బిల్లులను అక్కసుతో నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేయగా, మరికొందరు మధ్యలోనే పనులు నిలిపివేశారు. పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బడుగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

సొంత స్థలం కలిగి, ఇల్లు కట్టుకునే వారికి అప్పటి తెదేపా ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షల చొప్పున యూనిట్ విలువగా నిర్ణయించింది. నిర్మాణం పూర్తయిన వారికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వం 3,898 మంది లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేయగా 3,360 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించారు. 538 మంది లబ్ధిదారులు ఇప్పటికీ ఇంటి పనులు మొదలు పెట్టలేదు.

యాప్‌లో వివరాల నమోదు..

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన వారు ఎంత వరకు పూర్తిచేశారనే విషయంపై క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది, అధికారులు సర్వే చేపట్టారు. గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించిన గృహాలు ఏ దశలో ఉన్నాయనేది పరిశీలించి చిత్రాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ సర్వే ప్రక్రియ దాదాపు నియోజకవర్గంలో వందశాతం పూర్తయింది. ఇంటి నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో ఆగిన 3,360 మంది లబ్ధిదారులకు రూ.7,72,16,235 బిల్లులు విడుదల చేయాల్సి ఉంది.

ఆరు మండలాల్లో..

మండలం	ఎన్టీఆర్ ఇళ్లు	బిల్లుల బకాయిలు (రూ.లలో)
సి.ఎస్.పురం	848	1,55,27,319
హనుమంతునిపాడు	497	1,08,14.011
కనిగిరి	741	1,38,27,901
పీసీపల్లి	525	1,14,55,235
పామూరు	731	1,38,93,853
వెలిగండ్ల	556	1,16,97,916

రూ.50 వేలు రావాలి..



2016లో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు చేసింది. మొదట్లో సంతోషంగా ఉన్నాం. వైకాపా వచ్చిన తరువాత పనులు చేసి కొంత వరకు నిర్మాణం చేపట్టాం. ఇప్పుడు తెదేపా అధికారంలోకి వచ్చి బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పడం ఆనందంగా ఉంది. రూ.50 వేల వరకు బిల్లు రావాల్సి ఉంది. బిల్లు వస్తే కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.
–ఎస్.స్వర్ణ, లబ్ధిదారు, సి.ఎస్.పురం

త్వరలో మంజూరవుతాయి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గృహాలపై ఇప్పటికే దాదాపు సర్వే పూర్తి చేశాం. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల మంజూరుపై అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లు పూర్తి చేసుకున్న వారికి త్వరలో బిల్లులు జమ అవుతాయి. పూర్తి కాని లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా చేపట్టి పూర్తిచేస్తే బిల్లులు మంజూరవుతాయి.
–బి.కోటిరెడ్డి, డీఈఈ గృహనిర్మాణ సంస్థ, కనిగిరి

వ్యాసం రాసి.. విజేతగా నిలిచి

విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞాన వికాసం పెంపుదలకు ప్రతిభా పాటవ పోటీలు దోహద పడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో కనిగిరిలోని ఆల్ఫా ఒలింపియాడ్ పాఠశాల, దర్శిలోని గౌతమీ గ్రామర్ పాఠశాల, సింగరాయకొండలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వీటిలో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆల్ఫా పాఠశాల నుంచి కేవీ.సత్యమాధురి, జీవీఎస్.అహల్య, జి.ప్రమీల మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి విద్యా సంస్థల డైరెక్టర్ జి.మాలకొండారెడ్డి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సోని థామస్, ఉపాధ్యాయులు ఖాజానాయబ్ రసూల్, ఎ.రవికుమార్, రాజారావు తదితరులు పాల్గొన్నారు. గౌతమీ పాఠశాలకు చెందిన ఎం.రీనా హర్షిణి, పావని గీతిక, పావని పూజితలు విజేతలు కాగా ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ బృందం గౌస్‌బాషా, ఆదిలక్ష్మి, రంగారావు, గోపి, శ్రావణి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్ నుంచి నర్రా ప్రియాంక, షేక్ జెయానాసాయి, శీలం నిక్షితలు విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కొండలరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.
–న్యూస్‌టుడే, కనిగిరి, దర్శి, సింగరాయకొండ గ్రామీణం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆల్ఫా విద్యాసంస్థల డైరెక్టర్ మాలకొండారెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గౌతమీ గ్రామర్ పాఠశాల ఉపాధ్యాయ బృందం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు

బాలలతో పని చేయించడం నేరం

కనిగిరి, న్యూస్‌టుడే: బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని కనిగిరి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని దుకాణాలు, మెకానిక్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. 14 సంవత్సరాలలోపు బాలలతో పనిచేయించడం నేరమని వివరించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించి వారికి పునరావాసం కల్పించే ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై ఆరా



కనిగిరి: బాలికలతో కలిసి భోజనం చేస్తున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరి: వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలున్నా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, న్యాయమూర్తి కె. భరత్ చంద్ర పేర్కొన్నారు. గురువారం సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. బాలికలతో కలిసి భోజనం చేసి నాణ్యత పరిశీలించారు. సంక్షేమాధికారిణి జయంతి, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల పాఠశాల వసతి గృహాన్ని ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో నారాయణరెడ్డిలు పరిశీలించారు. ● పీసీపల్లి: ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరశర్మ పీసీపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీలోని బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. ఎస్వో సుజాత పాల్గొన్నారు.● హనుమంతునిపాడు: హెచ్‌ఎంపాడు కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంపీడీవో ఎం.రంగసుబ్బారాయుడు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్‌వో టి.అంజమ్మ ఉన్నారు. ● దర్శి: ఎంఈవో-2 రమాదేవి దర్శిలోని అంబేడ్కర్ గురుకుల, కస్తూర్బా విద్యాలయంతో పాటు పలు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ● తాళ్లూరు: తాళ్లూరులోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో కె.సుందరరామయ్య పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో పలువురు సిబ్బందితో పరిశుభ్రత చర్యలు అప్పటికప్పుడే చేపట్టారు. వార్డెన్ తెరేజమ్మ, తదితరులు పాల్గొన్నారు.
● ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, ముండ్లమూరులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీవో రావూరి జనార్దన్ పరిశీలించారు. ● పొన్నలూరు: ఎంపీడీవో పి.సుజాత స్థానిక పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేశారు. బాలికలతో కలిసి అల్పాహారం తిన్నారు. ఎంఈవో హరిబాబు, ప్రధానోపాధ్యాయులు మాధవరావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

దారి ఇలా.. వెళ్లేదెలా..!



మండలంలోని లింగాలపాడు-మన్నేపల్లి రహదారి అడుగుకో గొయ్యిలా తయారైంది. వర్షం కురిస్తే అంతే సంగతులు.. వర్షపు నీరంతా రహదారిపై ఉన్న గుంతల్లో నిలిచిపోయి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. తురకపాలెం, రమణాలవారిపాలెం, విఠలాపురం, కొత్తూరు, మన్నేపల్లి, ఇతర గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం అధ్వానంగా మారడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. వీలైనంత త్వరలోనే రహదారికి మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లూరు

పెద్ద చెరువులో దొంగలు పడ్డారు

● నకిలీ పట్టాలతో ఆక్రమణలు

న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి పెద్ద చెరువును శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించినట్లు చారిత్రక నేపథ్యం ఉంది. దీని విస్తీర్ణం సుమారు 250 ఎకరాలు. గతంలో దీనిని నమ్ముకుని వెయ్యిమంది రైతులు వ్యవసాయం చేసేవారు. ప్రస్తుతం వారి సంఖ్య తగ్గింది. ఇటీవల కాలంలో కనిగిరి గ్రేడ్-2 మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కావడం, రైల్వే లైన్, జాతీయ రహదారి రావడం వల్ల ఒక్క సారిగా ఈ ప్రాంతంలో భూములకు రెక్కలు వచ్చాయి. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా ఆక్రమిస్తున్నారు. పెద్ద చెరువుపై అన్ని పార్టీలకు చెందిన నేతల కన్ను పడింది. ఇంకే ముంది రెవెన్యూ అధికార్లతో కుమ్మక్కై సుమారు 60 నుంచి 70 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారు. ఏడు సర్వేనంబర్లలో చెరువు లోతట్టు ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించి వెంచర్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే తమకు రెవెన్యూ అధికారులే పట్టాలిచ్చారని ఆక్రమణదారులు చెబుతుండడం గమనార్హం.



ఆక్రమించిన చెరువు స్థలంలో వెలసిన వెంచర్

సర్వే చేయని రెవెన్యూ అధికారులు..


కనిగిరి పెద్ద చెరువు ఆక్రమణలకు అయిదేళ్ల కాలంలో రెవెన్యూ శాఖ అధికారులు పూర్తిగా ఆక్రమణదారులవైపు మొగ్గు చూపగా.. జలవనరుల శాఖ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లే వ్యవహరిస్తున్నారు. వాస్తవంగా రెండు శాఖలకు సంబంధించిన చెరువు కావడంతో ఏ మేరకు ఆక్రమణలకు గురైందో సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించాలి. ఆపై జలవనరుల శాఖ దీనిని కాపాడాలి. కానీ ఎవరికి వారు యమునా తీరు.. అన్నట్లుగా ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డులేకుండా పోయింది. ఇదే అదనుగా పలుకుబడి కలిగిన రాజకీయ నేతలు, స్థిరాస్తి వ్యాపారులు ఏటా ఎంతో కొంత ఆక్రమించుకుని వెంచర్లు వేసి ప్లాట్లు పెట్టి విక్రయిస్తున్నారు. ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. పెద్ద చెరువును చాలా వరకు ఆక్రమించిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై సర్వే చేసి బౌండరీలు వేసి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు కోరామని, ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వివరాలు ఇవ్వగానే ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.



కనిగిరి పెద్దచెరువులో వేసిన వ్యర్థాలు

రెవెన్యూ గ్రామసభల్లో అర్జీల వెల్లువ

తాళ్లూరు, న్యూస్‌టుడే: తాళ్లూరు మండలం శివరాంపురంలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామ సభకు అర్జీలు వెల్లువెత్తాయి. గత వైకాపా పాలనలో జరిగిన భూ రీ సర్వేలో తప్పులు తడకలు చోటుచేసుకున్నాయి. వాటిని సవరించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోంది. దీంతో రైతుల నుంచి భారీ స్థాయిలో వినతులు అందాయని డీటీ ఇమ్మానియేల్‌రాజు తెలిపారు. గ్రామంలో 250 మంది రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు.
● ముండ్లమూరు: మండలంలో రీసర్వే జరిగిన చింతలపూడిలో గ్రామసభకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, రీసర్వే డీటీ స్రవంతి పాల్గొన్నారు. రైతుల నుంచి 26 అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ మూర్తి తదితరులు పాల్గొన్నారు.
● దొనకొండ: రీసర్వే జరిగిన గ్రామాల్లో తప్పులుంటే సవరిస్తామని తహసీల్దార్ రమాదేవి చెప్పారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామసభకు ఆమె హాజరయ్యారు. సర్వే సక్రమంగా చేయలేదని, హద్దుల్లో కొన్ని రాళ్లు లేవని, దీంతో భూ సమస్యలు పెరిగాయని రైతులు వివరించారు. వీటిపై 30 అర్జీలు అందజేశారు. డీటీ నాగార్జున, సర్వేయర్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: చింతలపూడిలో మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న డీటీ శ్రీకాంత్, పాల్గొన్న అధికారులు

● హనుమంతునిపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లి పరిధిలోని కోటతిప్పలలో తహసీల్దారు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మొత్తం 139 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. డీటీ కిశోర్‌రెడ్డి వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● పొన్నలూరు: మండలంలోని వెల్లటూరులో నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 60 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ వి.పుల్లారావు తెలిపారు. ఆర్ఐ నరసయ్య, సర్వేయర్ రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బియ్యం వితరణ

పీసీపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని పెదవరిమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య అన్నారు. ఆయనతోపాటు, పెదఇర్లపాడుకు చెందిన ఉండేల నారాయణరెడ్డి, వెంగళాయపల్లికు చెందిన మహాలక్ష్మయ్యలు కలిసి గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మధ్యాహ్న భోజనానికి రూ.17 వేల విలువ చేసే బియ్యాన్ని అందించారు. దాతలను మండల విద్యాశాఖ అధికారులు సంజీవ్, శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం

మర్రిపూడి: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించాలని కొండపి సీఐ సోమశేఖర్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి, కేసుల వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, కేసులు సత్వరం పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎస్సై.రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారక్షణలో పోలీసులది కీలక పాత్ర

పీసీపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర చాలా కీలమైందని ఎస్సై కోటయ్య వివరించారు. గురువారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పీసీపల్లి కేజీబీవీ విద్యార్థినులకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రణాళిక, లక్ష్యంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. రోజువారి కేసుల వివరాలు, బాధితులకు న్యాయం చేయడంపై బాలికలకు వివరించారు.



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పాము కాటుతో మహిళ మృతి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కమ్మవారిపాలెంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దుళ్ల చౌరమ్మ(48), పశుగ్రాసం కోసేందు పొలానికి వెళ్లారు. గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను వినుకొండ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దేకనకొండ నిందితులకు ఎస్పీ కౌన్సెలింగ్

ఒంగోలు నేరవిభాగం: కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఘర్షణలకు పాల్పడిన నిందితులకు ఎస్పీ దామోదర్ గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్టీలు ఏవైనా, నాయకులు ఎవరైనా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. మరోసారి గ్రామంలో ఇదే తరహా ఉద్రిక్తతలకు దారితీసేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలి

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుచౌటపాలెం ఎస్సీ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని దళితసేన నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై గత నెల పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ఏర్పాటు కోసం అంచనాలు తయారు చేశారు. ఈ కాపీని పంచాయతీ కార్యదర్శి చక్రవర్తికి దళితసేన నాయకులు గురువారం అందించారు. నాయకులు ప్రేమ్‌కుమార్, మోషె, ప్రసాద్, నాగమణి, పౌలు తదితరులు పాల్గొన్నారు.

వార్డు ప్లానింగ్ సెక్రటరీ బదిలీ

ఒంగోలు నగరం: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న వార్డు ప్లానింగ్ సెక్రటరీ జి.శ్రీకాంత్‌ను దర్శి నగర పంచాయతీకి బదిలీ చేశారు. ఆయన డిప్యుటేషన్‌పై టీపీవో విభాగం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి: ప్రభుత్వం అందించే రాయితీలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ పశుగణన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గొర్రెల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు తోడేటి గోపీ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి వినతి

దర్శి, న్యూస్‌టుడే: దర్శి నియోజకవర్గంలో తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి కోరారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి ద్వారా ఆ ప్రాంత ప్రజల వలసలను నివారించవచ్చని, అందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డా.లలిత్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. ఖరీదు నిండుప్రాణం

● అనుమతులు లేకుండానే ఎల్‌సీలతో ప్రమాదాలు

న్యూస్‌టుడే, దొనకొండ

ఎక్కడైనా విద్యుత్తు పరంగా సమస్య ఉన్నప్పుడు మరమ్మతులు చేయడానికి ఆ లైన్‌ను పరిశీలించి సంబంధిత ఏఈకి సమాచారం ఇవ్వాలి. విద్యుత్తు సరఫరా నిలిపివేయించిన తర్వాతే మరమ్మతులు చేయాలి. అయితే గ్రామాల్లో విధులు నిర్వర్తించే లైన్‌మేన్‌లు సమస్య తలెత్తినప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ఆ గ్రామంలోని వ్యక్తి పనిచేస్తాడని సమాచారం ఇస్తారు. వెంటనే అతను అక్కడికి వెళ్లి పనిచేయాలని విద్యుత్తు ఉపకేంద్రానికి ఫోన్ చేయగానే ఎల్‌సీ (సంబంధిత లైన్‌కు విద్యుత్తు సరఫరా నిలిపివేత) ఇచ్చామని చెప్పడంతో స్తంభం పైకి ఎక్కుతున్నారు. అది ఏ లైనో, దేనికి ఎల్‌సీ ఇస్తున్నారో పనిచేసే వారికి తెలియడం లేదు. ఎస్‌సీ ఇచ్చేవారికి కూడా అవగాహన లేకపోవడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. రూ.వేలకు వేలు వేతనాలు తీసుకుంటూ కొందరు లైన్‌మేన్‌లు ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తుండడంతో వారు తగిన జాగ్రత్తలు తీసుకోక ప్రాణాలు కోల్పోతున్నారు. దొనకొండ మండలంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ నిదర్శనాలు..

మండలంలోని చందవరంలో ఈ నెల 19న వ్యవసాయ పరివర్తకం మరమ్మతులు చేయడానికి ఉపకేంద్రంలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న నాగార్జున అనే యువకుడు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. మూడు సంవత్సరాల క్రితం దొనకొండకు చెందిన మధు అనే యువకుడు మరమ్మతులు చేయడానికి పోలేపల్లి వెళ్లి, ఒక లైనుకు ఎల్‌సీ తీసుకొని మరొక లైను ఎక్కించడంతో ప్రాణాలు కోల్పోయాడు. కొన్ని సంవత్సరాల క్రితం రుద్రసముద్రంలో ప్రైవేటు వ్యక్తితో పనిచేయిస్తుంటే విద్యుదాఘానికి గురై మృతి చెందాడు. రెండేళ్లలో ఇద్దరికి విద్యుత్తు ప్రమాదాల్లో వేళ్లు తెగిపోయాయి.



దొనకొండలోని విద్యుత్తు ఉపకేంద్రం

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం..

దొనకొండ మండలంలో విద్యుత్తు శాఖలో సక్రమంగా పనిచేయని ఉద్యోగులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చందవరంలో ఇటీవల జరిగిన ఘటనపై ఏడీఈను విచారించమని ఆదేశించాం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తప్పవు.
–శ్రీనివాసరావు, ఈఈ, దర్శి విద్యుత్తు శాఖ

అయ్యప్ప స్వాములకు అన్నదానం



ముండ్లమూరు మండలంలోని మారెళ్లలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు గురువారం అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలోని అంకాళమ్మతల్లి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద రెండు చోట్ల ఈ సౌకర్యం కల్పించారు. దాతలు, స్థానికుల సహకారంతో గ్రామంలో సుమారు పదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 48 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. –న్యూస్‌టుడే, ముండ్లమూరు

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

కాలువలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: హోటల్ వ్యర్థాలను కాలువలోకి వదిలితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అద్దంకి బస్టాండ్ కూడలిని గురువారం పరిశీలించారు. ఓ హోటల్ నిర్వాహకులు నేరుగా కాలువలోకి వ్యర్థాలు వదులుతున్నట్లు గుర్తించారు. ఇదే విషయమై గతంలో నోటీసు ఇచ్చినా మళ్లీ అలాగే చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మారకపోతే చర్యలు తప్పవన్నారు. అనంతరం గుంటూరు రోడ్డులోని ప్రధాన కాలువను పరిశీలించి... తక్షణం పూడికలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇస్లాంపేట ఒకటో లైన్‌లో కాలువ నిర్మాణం సరిగా లేక మురుగు నిలిచిపోతుందని స్థానికులు చెప్పడంతో... పట్టణ ప్రణాళిక సిబ్బందితో మార్కింగ్ వేయించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాంగ్‌వర్క్ ద్వారా ఇస్లాంపేటలోని కాలువలు శుభ్రం చేయాలని సిబ్బందికి తెలిపారు. రిక్షాలబజార్ రెండో లైన్‌లో రోడ్డుపై ఉన్న యంత్రసామగ్రి తొలగించాలని యజమానులకు సూచించారు. ఎంఈ చంద్రయ్య, ఎంహెచ్‌వో మనోహరరెడ్డి, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.



అద్దంకి బస్టాండ్ కూడలిలో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

లోక్‌సభ స్పీకర్‌తో ఎంపీ మాగుంట భేటీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను దిల్లీలోని కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా నియమించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ● **జిల్లాలో ఎంపీ పర్యటన...:** ఈ నెల 26, 27 తేదీల్లో ఎంపీ మాగుంట జిల్లాలో పర్యటించనున్నారు. తొలి రోజు ఉదయం 10.30 గంటలకు ఒంగోలు తెదేపా కార్యాలయంలో నిర్వహించే పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొంటారు. అనంతరం రామనగర్‌లోని కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 27న ఉదయం పది గంటలకు తర్లుపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు హాజరవుతారు.



రక్షిత జలాలు అందించాలి

మద్దిపాడు, న్యూస్‌టుడే: జబ్బుల వ్యాప్తి చెందకుండా కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పల్లెల్లో రక్షిత జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు బి.వీరభద్రాచారి పేర్కొన్నారు. మద్దిపాడులో గురువారం ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కేంద్రం ఏటా పంచాయతీలకు నిధులు విడుదల చేసేదన్నారు. గత కొన్నేళ్లుగా ఆ నిధులు రాక పారిశుద్ధ్య, ఇతర కార్యక్రమాల నిర్వహణ పంచాయతీలకు భారంగా మారిందన్నారు.

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం మండలంలో శుక్రవారం నుంచి నవంబర్ 8 వరకు భూరీసర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు తెలిపారు. 25న పాదర్తి, 29న పాయకారి కంద్రిక, నవంబర్ ఒకటిన రాజుపాలెం, 5న మడనూరు, 8న ఈత ముక్కల గ్రామాల్లో సభలు ఉంటాయని... ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

28న ఉద్యోగ మేళా

సంతనూతలపాడు: ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో ఈ నెల 28న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ కలిసి నిర్వహిస్తున్న మేళాలో... ఎంటిటేట్ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్, రిలయన్స్ (ట్రెండ్స్) బ్రహ్మోస్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ఎంపికలు చేపడుతున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని... పూర్తి వివరాలకు 99630 05209 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాయితీపై సౌర ఫలకాలు

చీమకుర్తి: రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని విద్యుత్తు ఏడీఈ శ్రీనివాసరావు తెలిపారు. నెలవారీ విద్యుత్తు వినియోగాన్ని బట్టి... ఒకటి నుంచి రెండు కిలోవాట్ల ప్యానళ్ల ఏర్పాటుకు రూ.30 వేల నుంచి రూ.60 వేలు; రెండు నుంచి 3 కిలోవాట్ల లోపు రూ.60 వేల నుంచి రూ.78 వేలు; మూడు కిలోవాట్ల ప్యానళ్ల ఏర్పాటుకు రూ.78 వేల రాయితీ లభిస్తుందన్నారు.

దీపావళి నుంచి వంటింట్లో వెలుగులు

◆ ఏటా మూడు సిలిండర్లు ఉచితం ◆ ఒంగోలు, సంతనూతలపాడులో 1.60 లక్షల మందికి ప్రయోజనం


న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం

సూపర్ సిక్స్‌లో భాగంగా మహాశక్తి పథకం కింద ప్రతి ఇంటికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. ఆ మేరకు దీపావళి పండగ నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 23న జరిగిన మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో బియ్యం కార్డున్న దాదాపు 1.60 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు పెరిగి... కుటుంబ బడ్జెట్ తలకిందులైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ఊరట లభించనుంది.

ప్రతి నాలుగు నెలలకు ఒకటి...

ప్రస్తుతం ఒంగోలులో సిలిండర్ ధర రూ.848 (ప్రాంతాన్ని బట్టి స్వల్పంగా మారుతుంది)గా ఉంది. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.21.57 చొప్పున రాయితీ ఇస్తోంది. మిగతా రూ.826.43 వినియోగదారులు భరిస్తున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబం సగటున రెండు నెలలకు ఓ సిలిండర్ వినియోగిస్తోంది. అంటే ఏడాదికి ఆరు అవసరం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ఆ మేరకు వంటింటిపై గ్యాస్ భారం సగం తగ్గినట్లే. ప్రస్తుత లెక్కల ప్రకారం ఒక్కో ఇంటికి సగటున రూ.2,479 చొప్పున లబ్ధి చేకూరనుంది. డెలివరీ తీసుకున్న 48 గంటల్లో సిలిండర్ సొమ్ము నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.

మండలాల వారీగా లబ్ధి పొందనున్న కుటుంబాలు...



1,59,935 మొత్తంగా లబ్ధి అందుకోనున్న వారు

రూ.39.65 కోట్లు ఏటా కలిగే ఉపశమనం



ధరాభారం నుంచి ఊరట...



నిత్యావసరాలతో పాటు అన్ని రకాల కూరగాయల ధరలూ పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల జీవనం భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం గొప్ప ఊరట. వంటింటి బడ్జెట్ తగ్గుతుంది.
– కోమటినేని పద్మలత, మండువవారిపాలెం

ఎంతో ప్రయోజనం...



గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాలే ఎక్కువ. పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క రూపాయి అదనంగా ఖర్చు పెట్టాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. ఇటువంటి తరుణంలో ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం వల్ల... మాలాంటి వారెందరికో ప్రయోజనం చేకూరుతుంది. – కారుమూడి హిమజ, ఒంగోలు మండలం

పిల్లల మేధకు పరీక్ష



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వ్యాసరచన పోటీలు సందడిగా సాగాయి. ఒంగోలు కోర్టు సెంటర్‌లోని రవీంద్రభారతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో... 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై... తమ అభిప్రాయాలను చక్కగా వివరించారు. పదో తరగతి విద్యార్థులు బీకే శ్రీఆదిత్య, పి.శివాని, 9వ తరగతికి చెందిన జె.రోహితశ్రీ... ప్రతిభ చాటి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బీఎల్ ప్రసన్నకుమారి, ఇన్‌ఛార్జి జె.రోహిత్, ఆంగ్ల ఉపాధ్యాయిని పి.శివపార్వతి చేతులమీదుగా వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



బహుమతులు అందుకున్న వారితో పాఠశాల ప్రతినిధులు

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఈ నెల 26 నుంచి నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు ఒంగోలులోని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కార్యాలయంలో నాయకులు గురువారం సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో కార్యక్రమం చేపట్టాలని... గతానికి మించి నమోదు చేయాలని నిర్ణయించారు. పార్టీ నాయకులు మన్నం ప్రసాద్, రిసోర్స్ పర్సన్ ఎస్.శాంతిబాబు, మండలాధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, మండవ జయంత్‌బాబు, తేళ్ల మనోజ్‌కుమార్, గొల్లపూడి సుబ్బారావు, నాయకులు స్వాములు, వేల్పుల శ్రీనివాసరావు, గోవింద్, చైతన్య, రావి శ్రీనివాసరావు, గుమ్మడి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడికి సత్కారం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్‌ను సంతనూతలపాడు క్లబ్ ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆయనను జిల్లా ప్రతినిధి వీఎన్ ప్రసాదరావు, మండలాధ్యక్షుడు వేమూరి వెంకటశేషారావు, కార్యదర్శి చలువాది రాములు మర్యాదపూర్వకంగా కలిశారు.



బహుమతి చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ రమ, ప్రతినిధులు

విద్యార్థుల ఉన్నతికి కృషి

ఒంగోలు నగరం: భవిష్యత్తుకు అవసరమైన ప్రమాణాలతో విద్యార్థులు విద్యనభ్యసించాలని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ రమ పేర్కొన్నారు. భాగ్యనగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. భావిభారత నిర్మాణంలో భాగమయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి బహుమతులు అందజేశారు. జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, శాఖాధిపతులు రాజేష్, దివ్య ప్రమీల, ఏజీఎం పెద్దిరెడ్డి, వేదవతి, శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వార్డు ప్లానింగ్ సెక్రటరీ బదిలీ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న వార్డు ప్లానింగ్ సెక్రటరీ జి.శ్రీకాంత్‌ను దర్శి నగర పంచాయతీకి బదిలీ చేశారు. ఆయన డిప్యుటేషన్‌పై టీపీవో విభాగం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన వ్యవహార శైలిపై కొందరు కార్పొరేటర్లు ఫిర్యాదు చేయడంతో... ఆ బాధ్యతల నుంచి తప్పించి బదిలీ చేసినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నాగులుప్పలపాడు: కారు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఉప్పుగుండూరు ఎస్సీ కాలనీకి చెందిన దేవరపల్లి మహేష్... నిడమానూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. నాగులుప్పలపాడు కూడలిలో ఒంగోలు నుంచి చీరాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

కమ్మపాలెంలో వసతుల కరవు



పైప్‌లైను మరమ్మతుల కోసం తవ్వి వదిలేసిన గుంత

గత అయిదేళ్లుగా వసతుల మెరుగు పరంగా కనీస చర్యలు లేక ఎనిమిదో డివిజన్‌లో భాగంగా ఉన్న కమ్మపాలెంలో చిక్కులు నెలకొన్నాయి. ఎన్టీఆర్ విగ్రహం ఎదుట లైన్‌లో నివాసాల నుంచి సేకరించిన వ్యర్థాలను రోడ్డు పక్కనే పారబోస్తుండడంతో సమస్య నెలకొంటోంది. కాలువల చుట్టూ పచ్చిక పెరగడంతో విషకీటకాలకు ఆవాసంగా మారి ఇబ్బందులు తప్పడం లేదు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో కొంత మేర కాలువ నిర్మాణం చేపట్టక... వర్షం పడిన ప్రతిసారీ రోడ్డుపైనే మురుగు నిలిచిపోతోంది. ఇదే మార్గంలో పైపులైను మరమ్మతుల కోసం గుంత తవ్వి తిరిగి పూడ్చలేదు. రాత్రివేళ అటుగా వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రోడ్లు సైతం అసంపూర్తిగా ఆగిపోయాయి. కార్పొరేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కమ్మపాలెం (ఒంగోలు అంజయ్య రోడ్డు)



వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో కాలువ లేక ఇలా...

సమస్యల 'బృందావనం'

46వ డివిజన్‌లో భాగంగా ఉన్న బృందావన్‌నగర్‌లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలు ప్రస్తుత అవసరాలకు చాలడం లేదు. దీంతో చిన్నపాటి వర్షం పడినా మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది. ఈ ప్రాంతంలో ప్రైవేటు వసతి గృహాలు ఎక్కువ. వివిధ ప్రాంతాల విద్యార్థులు ఇక్కడ ఉంటూ చదువులు కొనసాగిస్తున్నారు. దోమల సమస్య తీవ్రంగా ఉండడంతో రాత్రి వేళ నిద్ర ఉండడం లేదని వారంతా వాపోతున్నారు. కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లడంతో పాటు... దోమల నివారణకు ఫాగింగ్ వంటివి చేపట్టాలని కోరుతున్నారు. నాలుగో లైన్‌లో విద్యుత్తు స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకుని... తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, నిప్పురవ్వలు పడుతూ పరిస్థితి ప్రమాదకరంగా ఉంటోందని అక్కడివారు తెలిపారు. ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పండరీపురంలోనూ మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పారిశుద్ధ్య పనులు చేపట్టి... సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడివారు విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్య రోడ్డు



విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పిచ్చి తీగలు



నాలుగో లైన్‌లో కాలువ పరిస్థితి

విలీనంతో ఉసురు తీశారు!

న్యూస్‌టుడే – ఒంగోలు అర్బన్

● పేర్నమిట్ట అభివృద్ధి పట్టని పాలకులు

మున్సిపాలిటీగా ఉన్న ఒంగోలును నగర పాలక సంస్థగా మార్చే క్రమంలో మేజర్ పంచాయతీగా ఉన్న పేర్నమిట్టను విలీనం చేశారు. పుష్కరం దాటుతున్నా కార్పొరేషన్ పరంగా ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధేమీ లేదు. పంచాయతీ పాలనలో వేసిన రోడ్లు, కాలువలు, పైపులైన్లే నేటికీ ఆధారంగా ఉన్నాయి. నియోజకవర్గాల పరంగా చూసినా ఇది సంతనూతలపాడులో భాగంగా ఉండడంతో... మిగతా నగరంతో పోలిస్తే ఈ ప్రాంతంపై కొంత చిన్నచూపు ఉంటోందన్న అభిప్రాయం ఈ ప్రాంతవాసుల్లో వ్యక్తమవుతోంది.

దారులు ఘోరం...

కర్నూలు రోడ్డులోని ఆటో స్టాండ్ నుంచి సుబ్బయ్య హాస్టల్ వైపు వచ్చే మార్గం; జడ్పీ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ విగ్రహం నుంచి శివాలయానికి వెళ్లే సీసీ రోడ్లు పూర్తిగా శిథిలమైన రూపుకోల్పోయాయి. ఏళ్లుగా కనీస మరమ్మతులూ చేపట్టలేదు. పీర్లమాన్యం, క్రిస్టియన్‌పాలెం, శాంతినగర్ శివారులో నేటికీ మట్టి దారులే ఆధారంగా ఉన్నాయి. నగరాన్ని అనుసంధానిస్తూ నివాసాలు విస్తరిస్తున్న లింగారెడ్డి కాలనీ, ఆ పరిసర ప్రాంతాల్లో... గుంతల మయమైన గ్రావెల్ దారుల్లో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎగువ నుంచి వచ్చే వరద, మురుగు బయటకు పోయే దారిలేక... ఇక్కడి ప్రధాన మార్గాన్ని ఆనుకుని ఉన్న కాలువలో నిలిచిపోతోంది. పారిశుద్ధ్య పనులు చేసేందుకూ వీల్లేని దుస్థితి నెలకొంది.



కాలువ లేక పోలేరమ్మ ఆలయం వద్ద కర్నూలు రోడ్డుపై పారుతున్న మురుగు

కాలువలు అంతంతమాత్రం...

గ్రామంలోని మురుగు కాలువలు సైతం విస్తరణకు నోచుకోలేదు. కమ్మపాలెం, అంబేడ్కర్ విగ్రహం కూడలి, రెడ్డి బజారు తదితర ప్రాంతాల్లో దశాబ్దం క్రితం నాటి కాలువలే నేటికీ ఆధారంగా ఉన్నాయి. పీర్లమాన్యం పరిసరాల్లో పరిస్థితి చెప్పనవసరం లేదు. చినుకుపడితే అటుగా వెళ్లేందుకూ వీల్లేని దుస్థితి. ఈ ప్రాంతంలోనే తరచూ జ్వరాల సమస్య తలెత్తుతోంది. కర్నూలు రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల అభివృద్ధిని విస్మరించడంతో... అటు మధ్యం గోదాముల వైపు మలుపు తిరిగే చోట, ఇటు పోలేరమ్మ ఆలయం వద్ద రోడ్డుపైనే మురుగు పారుతోంది. ఇక వర్షం పడితే ప్రధాన కూడలి డౌన్‌లో రోజుల తరబడి నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



లింగారెడ్డి కాలనీకి వెళ్లే దారి తీరిది

పేర్నమిట్టలో పదికి పైగా శివారు కాలనీలు... 30 వేలకు పైగా జనాభా ఉంటున్నారు. నగరంలో విలీనం చేయడంతో ఉపాధి హామీ పథకం అమలుకు అవకాశం లేకుండా పోయింది. అలాగని... నగర పాలక సంస్థ అధికారులూ పట్టించుకోవడం లేదు. మరోవైపు పన్నుల భారమూ పెరిగింది.



బి.వి.సుబ్బయ్య పాఠశాలకు వెళ్లే సిమెంట్ రోడ్డు దుస్థితి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

న్యూస్‌టుడే, సంతనూతలపాడు:

?: సంతనూతలపాడు బ్యాంకు బజారులోని వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ అటుగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – జనార్దన్, గ్రామస్థుడు

✓: పంచాయతీ కార్యదర్శికి చెప్పి సమస్యను పరిష్కరిస్తాం. – సురేష్‌బాబు, ఎంపీడీవో

చెట్టు కొమ్మల తొలగింపు

స్పందనకు వందనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని విద్యుత్తు స్తంభానికి చెట్టు అల్లుకుపోయి... గాలులు వీచే సమయంలో సరఫరాకు అంతరాయం కలుగుతోంది. సమస్యను కొందరు స్థానికులు తెలియజేయడంతో 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా'లో గురువారం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి... చెట్టు కొమ్మలు పూర్తిగా తొలగించి సమస్యను పరిష్కరించారు.

డిసెంబర్‌లోగా పంటల బీమా చేయించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో జేసీ గోపాలకృష్ణ తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 2024-25 సంవత్సరానికి రబీ సీజన్‌లో వరి పంటకు ఈ ఏడాది డిసెంబర్ నెల ఐదులోగా రైతులు పంటల బీమా చేయించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. జిల్లాలో సాగు చేస్తున్న పంటలు, వాటికి బీమా అమలుపై స్థానిక ప్రకాశం భవన్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జొన్న, శనగ, మినుము, మొక్కజొన్న, మిరప పంటలకు మాత్రం డిసెంబర్ 15లోగా ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియాన్ని చెల్లించేలా చూడాలన్నారు. పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రీమియం నగదును బ్యాంకులు మినహాయించుకునేలా రైతుల అంగీకారం తెలపవచ్చని సూచించారు. రుణాలు తీసుకోని వారు విడిగా కూడా చెల్లించవచ్చన్నారు. బీమా గడువు తేదీలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సీపీవో వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత అమరావతి నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఇతర అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.

అమూల్య జలం కడలి పరం


టంగుటూరు మండలం ఎం.నిడమానూరు వద్ద మూసి వాగు ఉద్ధృతి

● మూసి, పాలేరుల్లో చెక్‌డ్యాంలు లేక నిలవని నీళ్లు ● సుమారు రెండు టీఎంసీల వరకు వృథా

న్యూస్‌టుడే, టంగుటూరు, కొండపి గ్రామీణం

వర్షాలు లేనప్పుడు అయ్యో వరుణుడు కరుణించలేదే అని నిట్టూర్చుతాం. తీరా వానలు పడి సమృద్ధిగా జలాలు వచ్చినా వాటిని ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోలేకపోతున్నాం. కొండపి నియోజకవర్గంలో అనేక కృష్ణా నీళ్లు కడలి పాలవుతున్నా చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. మూసి, పాలేరు వాగుల్లో చెక్‌డ్యాంలు నిర్మించి జలప్రవాహానికి అడ్డుకట్ట వేసి అనంతరం ఆ నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉన్నా... గత పాలకులు దృష్టిచూపని కారణంగా వర సునీరంతా సముద్రం పాలవుతోంది.

కొండపి నియోజకవర్గంలో పాలేరు, మూసి వాగులు సుమారు 150 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నాయి. మూసి వాగు కంభం సమీపంలోని ఎర్రఒబనపల్లి వద్ద పుట్టి దర్శి, తాళ్లూరు, పొదిలి, చీమకుర్తి, కొండపి, సంతనూతలపాడు, టంగుటూరు, జరుగుమల్లి మండలాల మీదుగా ప్రవహిస్తోంది. వర్షాలు పడిన పుడు ఉగ్రరూపం దాల్చడంతో పలు మండలాలకు రాకపోకలు సైతం నిలిచి పోతుంటాయి. వానలు లేనప్పుడు చుక్కనీరు నిలవక ఎడారిని తలపిస్తుంది. ఈ వాగు పరిధిలో లక్షల ఎకరాల భూములను రైతులు సాగుచేస్తున్నారు. బెట్టకొచ్చిన పంటలకు నిల్వ ఉన్న కొద్దిపాటి నీటినే అందించి కాపాడుకుంటారు. గతంలో అక్కడక్కడ చెక్‌డ్యాంలను నిర్మించారు. కొండపి, టంగుటూరు, జరుగుమల్లి మండలాల పరిధిలో నాలుగు మాత్రమే ఇవి ఉన్నాయి. వీటి సంఖ్య మరింత పెంచాల్సి ఉంది. కొండపి మండలం మద్దులూరు, అనకర్లపూడి, రేగలగడ్డపాలెం, కోడూరు, ముప్పవరం, టంగుటూరు మండలం పొందూరు, ఎం.నిడమానూరు, కారుమంచి, జయవరం, కాకుటూరివారిపాలెం, జమ్ములపాలెం, తూర్పు నాయుడుపాలెం, ఆలకూరపాడు, అనంతవరం గ్రామాల సమీపంలో కొత్తగా 14 చెక్‌డ్యాంలు నిర్మించాల్సి ఉంది. మూసికి సాగర్ నీటిని విడుదల చేయాలని, దీంతో చెరువులను నింపాలంటూ టంగుటూరుకు చెందిన 'మూసికి సాగర్ నీరు సాధన సంఘం' ఆధ్వర్యంలో ఇటీవల డిమాండ్ చేసింది. వాగులు పొంగిపొర్లిన సమయంలో సుమారు 2 టీఎంసీల వరకు నీరు సముద్రంలో కలుస్తుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

చొరవ తీసుకుంటేనే...

పాలేరు వాగు వెలిగండ్ల మండలం పందువ గ్రామంలో పుట్టి వెలిగండ్ల, పీసీపల్లి, కనిగిరి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల మీదుగా ప్రవహించి టంగుటూరు మండలం పసుపుగల్లు వద్ద సముద్రంలో కలుస్తోంది. సుమారు 165 కి.మీ దూరం ప్రవహిస్తోంది. కొండపి నియోజకవర్గం పరిధిలో అధికంగా జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో ప్రవహిస్తూ వృథాగా, తాగునీటి అవసరాలను తీరుస్తోంది. దీని పరిధిలో సుమారు 16 వరకు చెక్‌డ్యాంలు నిర్మించాలని ఆయా మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు. అయినా ఇంత వరకు ఎవరూ చొరవ తీసుకోలేదు.


టంగుటూరు మండలం రావివారిపాలెం వద్ద పొంగిపొర్లుతున్న పాలేరువాగు

నీటి సద్వినియోగానికి ప్రణాళికలు..

కొండపి నియోజకవర్గంలోని పాలేరు, మూసి వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. వృథా అవుతున్న నీటిని నిల్వ చేసి రైతులకు మేలు చేకూరేలా ఆలోచనలు చేస్తున్నాం. సముద్రం పాలవుతున్న నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు ఇంకిపోకుండా, మెట్టపంటలు నీరు వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేస్తాం.

–డోలా బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అర్చక పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించే అర్చక పరీక్షల దరఖాస్తులు అందజేసే గడువును ఈ నెల 31 వరకు పొడిగిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ (అర్చక) సంఘం జిల్లా అధ్యక్షుడు పణతుల మారుతి వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘం అధ్యక్షుడు మురిపట్ల రాంబాబు, ఐకాస నాయకులు కమిషనర్ సత్యనారాయణను కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ ఈ నెల 31వ వరకు దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించారన్నారు. నలభై సంవత్సరాలు దాటిన వారు మౌఖిక పరీక్షకు హాజరు కావచ్చని, రాత పరీక్షకు మినహాయింపు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అర్చకులు, వేదాధ్యాయ ఆసక్తి ఉన్నవారు వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

ఉచితంగా వినికిడి యంత్రాలందిస్తాం

ఒంగోలు నగరం: వినికిడి సమస్య ఉన్నవారికి రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం, దీనదయాళ్ స్వర ఫౌండేషన్ ద్వారా ఉచితంగా యంత్రాలు అందజేయనున్నట్లు జిల్లా సమన్వయకర్త డాక్టర్ భగీరథ పేర్కొన్నారు. అర్హులైన వారు శుక్రవారం జీజీహెచ్‌లోని బాలల సత్వర చికిత్స కేంద్రానికి రావాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వినికిడి పరీక్ష రిపోర్టు తప్పనిసరి అన్నారు. సందేహాలున్నవారు 995928 6963కు సంప్రదించాలన్నారు.

29, 30న సివిల్ సర్వీసెస్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సివిల్ సర్వీసెస్ మహిళ, పురుషుల క్రీడా జట్ల ఎంపిక... ఈ నెల 29, 30 తేదీల్లో ఒంగోలులోని డాక్టర్ పి. ఆనంద్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గుంటి రాజరాజేశ్వరి తెలిపారు. తొలి రోజున అథ్లెటిక్స్, చెస్, హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్యారమ్స్, హాకీ, క్రికెట్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, మ్యూజిక్ డ్యాన్స్ అండ్ షార్ట్ ప్లే, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. రెండో రోజున బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, కబడ్డీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, వాలీబాల్, ఖో-ఖో, యోగా విభాగాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని వివరించారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు తమ శాఖాధిపతి ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఎంప్లాయ్ ఐడీ, మూడు పాస్‌పోర్టు ఫొటోలు, క్రీడా దుస్తులతో 29న ఉదయం తొమ్మిది గంటలకు ఒంగోలు మినీ స్టేడియంలో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు నవంబర్ 6 నుంచి 9 వరకు విజయవాడ, గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 91211 06840 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్వర్ణాంధ్ర లక్ష్యాల సాకారానికి ప్రణాళిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 సాకారంలో భాగంగా ఆర్థిక వృద్ధి రేటు పెరిగేలా మండల, జిల్లా విజన్ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. ప్రణాళిక అమలపై అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో గురువారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. తుది ముసాయిదా డాక్యుమెంట్‌ను ఈ నెల 26న రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి బేబీరాణి, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష సెక్టోరల్ ఉద్యోగాలకు 58 దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 58 దరఖాస్తులు అందినట్లు డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. అయిదు సెక్టోరల్ అధికారులు, ఓ అసిస్టెంట్ సెక్టోరల్ అధికారి ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలో ఫారన్ సర్వీసుపై పనిచేయడానికి ఆసక్తిగల ఉపాధ్యాయులు దరఖాస్తులు సమర్పించారన్నారు. సీఎంవో పోస్టుకు 17, ఐఈ కోఆర్డినేటర్‌కు 8, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్‌కు 14, జీసీడీవో పోస్టుకు రెండు, ప్లానింగ్ కోఆర్డినేటర్‌కు 9, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌కు 8 దరఖాస్తులు అందాయన్నారు.

ఉపాధ్యాయులకు నేడు ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు నగరం: జిల్లాలోని హెచ్‌ఎంలు, టీచర్లకు శుక్రవారం ప్రాశస్త మొబైల్ యాప్‌పై ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు అవగాహన కల్పిస్తామన్నారు. స్పెషల్ టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, డైట్ సిబ్బంది తప్పక హాజరుకావాలన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రేషన్ సరకుల పంపిణీ, సరఫరాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత సమర్థంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ సరకుల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులొస్తే, పరిష్కరించాన్నారు. సమావేశంలో డీఎస్వో పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విధి వంచితపై వ్యాపారి దాడి

❖ వీడియో వైరల్ ❖ నిందితుడి అరెస్టు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని వృద్ధ మహిళపై ఓ వ్యాపారి విచక్షణారహితంగా కర్రతో దాడిచేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. ఒంగోలు ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మతిస్థిమితం లేని అరవై ఏళ్ల వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి అక్కడి పండ్ల రసాలు విక్రయించే షాపు ముందు నిద్రకు ఉపక్రమించారు. దీనికి అభ్యంతరం చెబుతూ దుకాణదారు ఆర్.నాగరాజు ఆమెపై కర్రతో దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఆ సమయంలో బస్టాండ్‌లో ప్రయాణికులున్నా ఎవరూ వారించే ప్రయత్నం చేయలేదు. దెబ్బలకు తాళలేక బాధితురాలు కేకలు వేస్తున్నా అతను శాంతించలేదు. ఈ సంఘటనను బస్టాండ్‌లో ఉన్న ఓ వ్యక్తి వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో స్పందించిన ఒకటో పట్టణ పోలీసులు నిందితుడు ఆర్.నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. తొలుత ఆమె తనపై దాడి చేసిందని, దీంతో తాను ఆమెను కొట్టానని నాగరాజు చెబుతున్నారు. బాధితురాల్ని వైద్యచికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


మెప్మా బజార్‌లోని ఉత్పత్తులు పరిశీలిస్తున్న అధికారులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని మెప్మా పీడీ టి.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య పేర్కొన్నారు. చీమకుర్తి పోలీసు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను గురువారం ప్రారంభించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా తక్కువ వడ్డీకే ప్రభుత్వం రుణాలు ఇస్తోందన్నారు. మెప్మా బజారుకు శాశ్వత వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేనేజర్ రఘు, జయకుమార్, సంతోష్, జగదీష్, రాజేశ్వరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. * కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ప్రధాని మోదీ చిత్రం ఏర్పాటు చేయక పోవడంపై భాజపా నాయకులు గుండా శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, దివి శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రధాని చిత్రం ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. హెచ్‌సీఎం పాఠశాలలోని ఇరవై మంది విద్యార్థినులకు గురువారం సభ్యత్వ కార్డులు అందజేశారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నవంబర్ 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రంథపాలకురాలు గోవిందమ్మ, విశ్రాంత ఎస్‌డీసీ పి.పేరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పా నిర్వాహకులపై కేసు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు - గుంటూరు రోడ్డులోని సారా స్పా సెంటర్‌పై తాలూకా పోలీసులు గురువారం దాడి చేశారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సీఐ అజయ్ కుమార్, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న ఇద్దరు మహిళలను హోమ్‌కు తరలించారు. నిర్వాహకులు కె.పవన్‌సాయి, కె.అజయ్‌లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దేకనకొండ నిందితులకు ఎస్పీ కౌన్సెలింగ్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా కురిచేడు మండలం దేకనకొండలో ఘర్షణలకు పాల్పడిన నిందితులకు ఎస్పీ దామోదర్ గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్టీలు ఏవైనా, నాయకులు ఎవరైనా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. మరోసారి ఉద్రిక్తతలకు దారితీసేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న పాత నేరగాళ్ల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నట్లు సీఐ హజరత్తయ్య తెలిపారు. వారి నుంచి రెండు కేజీల గంజాయితో పాటు పదమూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సంఘటన సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పరిధిలోని జాతీయ రహదారి వద్ద గురువారం చోటు చేసుకుంది.

నేలటూరులో 40 అర్జీలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో చోటుచేసుకున్న లోపాలను సరిదిద్దేందుకు నేలటూరులో గురువారం నిర్వహించిన గ్రామ సభకు... రైతుల నుంచి 40 అర్జీలు అందాయి. జాయింట్ ఎల్‌పీఎంలపై 32, పాస్‌పుస్తకాలకు 3, విస్తీర్ణంలో తేడాలు, మ్యుటేషన్ కోసం రెండేసి, కొరిలేషన్ సవరణకు మరో వినతిపత్రం అందినట్లు తహసీల్దార్ సుజన్‌కుమార్ తెలిపారు. సర్వేయర్ అంజలి, తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, కృష్ణమోహన్ రెడ్డి, వీఆర్వో శేషారావు, గ్రామ సర్వేయర్ సాయి పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుజన్‌కుమార్

వసతి గృహాల తనిఖీ

జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు, ఆహారం పరిశీలించారు. మరుగుదొడ్లు, నీటి వసతి తదితర సమస్యలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మంగమూరురోడ్డు, సంతపేట, భాగ్యనగర్, శర్మ కళాశాల రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ, బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను జడ్పీ సీఈవో బి.చిరంజీవి, ఎంపీడీవో శేషుబాబు పరిశీలించారు. * సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడులోని వసతి గృహాలను.. ఆయా మండలాల ఎంపీడీవోలు సురేష్‌బాబు, మహాలక్ష్మి, జ్యోతి తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అల్పాహారం రుచి చూశారు.

– న్యూస్‌టుడే బృందం


ఒంగోలు: బాలికల వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చిరంజీవి


సంతనూతలపాడు: ఎస్సీ వసతిగృహంలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈతముక్కల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్సై వి.సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు చెంచు పున్నయ్య, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు గృహ సందర్శన

ఒంగోలు నగరం: వ్యాధుల నివారణ కోసం శుక్రవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సిబ్బంది గృహ సందర్శన ద్వారా బాధితుల సమాచారం సేకరించాలన్నారు. దీనిపై గురువారం ప్రోగ్రాం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. గృహ సందర్శనకు వెళ్లిన వారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే ఆసుపత్రికి పంపించి వైద్య చికిత్స అందించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం లోపు జిల్లా కేంద్రానికి సమాచారం పంపాలన్నారు. గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి పైపులు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి, లీకులుంటే అరికట్టాలన్నారు. వ్యాధి తగ్గుముఖం పట్టిన వారు డాక్టర్ అనుమతితోనే ఇంటికి వెళ్లాలన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

మద్దిపాడు, న్యూస్‌టుడే: వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ మోహన్ పేర్కొన్నారు. పెదకొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. జిల్లా అధికారి వరప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఏఎన్ఎం వనజాక్షి, పూజిత, సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నాగన్నపాలెంలో సర్పంచి కాకర్ల విజయ్ ఆధ్వర్యంలో ఫాగింగ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, అంబిక తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కురిచేడు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కురిచేడులో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం..కురిచేడు గ్రామానికి చెందిన అంకె ఏడుకొండలు(36) గురువారం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లారు. మోటారు స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఏడుకొండలు భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు.

డెంగీ కేసు నమోదు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ యల్లయ్య నగర్‌లో డెంగీ కేసు నమోదు కావడంతో ఆయా శాఖల వారు అప్రమత్తమయ్యారు. కాలనీలో నివసిస్తూ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇతను డెంగీ బాధితుడు కావడంతో వైద్య ఆరోగ్య శాఖ గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది.

ఆందోళన చెంది.. ఉరికి వేలాడి..


పోచాలు (పాత చిత్రం)

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: స్వల్ప విషయానికి ఆందోళనకు గురై ఓ ఆటో చోదకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ముటుకుల పంచాయతీలోని తెల్లగట్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తెల్లగట్లకు చెందిన చిలకాబత్తిన పోచాలు(19) ఆటో చోదకుడు. గురువారం కూలీలను ఆటోలో తీసుకెళ్లి ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలో మరో ఆటోకు తగిలింది. ఇదే విషయాన్ని అతను ఇంటికొచ్చిన తర్వాత తల్లిదండ్రులకు తెలపగా, వారు ఆందోళన చెందవద్దని చెప్పి వారి వారి పనులకు వెళ్లిపోయారు. అనంతరం పోచాలు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని యర్రగొండపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.

మృతదేహం లభ్యం

దర్శి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో సాగర్ కాలువలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ రఫీ, సాదియా దంపతులు. రఫీ బేల్దారి మేస్త్రిగా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలు వెంటాడటంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రఫీ బుధవారం భార్యకు ఫోన్ చేసి సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పారు. కురిచేడు రోడ్డుకు సమీపంలో ఆయన కాలువలో దూకగా, మృతదేహం పొదిలి రోడ్డు సమీపంలో గురువారం గుర్తించారు. మృతదేహాన్ని ఎస్సై మురళి పరిశీలించి శవ పరీక్ష నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సాదియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 128, రిటైల్ లైవ్ - 150, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 248

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.